TGTEL/25/A3750

... నిజమే ...

# నిజాయితీ

https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక

"నిజాయితీ" ఒక ముఖ్యమైన నైతిక లక్షణం
ఇది విశ్వసనీయత, విధేయత మరియు
సమగ్రతను పెంచుతుంది.



ఎడిటర్ : బొడ్డుపల్లి మల్లయ్య  సంపుటి 1  సంచిక 59  నెట్‌వర్క్ ఇంచార్జ్ & మెయింటెనెన్స్ : గుండూర్ శ్యామ్ .  శనివారం 17 జనవరి 2026  వెల 4:00

# రాష్ట్రంలో తక్షణమే సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయండి: రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, జనవరి 16 (నిజాంయితి) :**
రాష్ట్ర ప్రభుత్వానికి, భారత ఆర్మీల మధ్య వివిధ సమస్యలు నిరంతర చర్చల ద్వారానే పరిష్కారం సివిల్ మిలిటరీ లైజన్ కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మనతెలంగాణ/హైదరాబాద్: గడిచిన పదేళ్లలో తెలంగాణలో ఒక్క సైనిక్ స్కూల్ కూడా మంజూరు చేయలేదని, రాష్ట్రంలో తక్షణమే సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్‌రెడ్డి భారత ఆర్మీని కోరారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఒక్కో రాష్ట్రానికి 2 నుంచి 4 సైనిక్ స్కూళ్లను మంజూరు చేశారని, తెలంగాణకు మంజూరు చేయలేదని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తుచేశారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సివిల్ మిలిటరీ లైజన్ కాన్ఫరెన్స్ జరిగింది. భారత సైన్యం, తెలంగాణ ప్రభుత్వం మధ్య పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు, ఇతర పరిపాలనా సమస్యల సత్వర పరిష్కారంపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, తెలంగాణ ఆంధ్రా సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ (టిఏఎస్‌ఏ) మేజర్ జనరల్ అజయ్ మిశ్రా, డిజిపి శివధర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం, ఆర్మీకి చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.
రాష్ట్ర ప్రభుత్వం తరఫున పలు విజ్ఞప్తులను ముఖ్యమంత్రి ఈ సమావేశంలో ఆర్మీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దేశ భద్రతకు సంబంధించిన అన్ని అంశాల్లో కేంద్రానికి, భారత సైన్యానికి సహకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే వికారాబాద్ దామగుండం వద్ద లో-ఫ్రీక్వెన్సీ విఎల్‌ఎఫ్ నేవీ రాడార్ స్టేషన్‌కు 3 వేల ఎకరాలు కేటాయించిన విషయాన్ని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి, భారత ఆర్మీకి మధ్య వివిధ సమస్యలు నిరంతర చర్చల ద్వారానే పరిష్కారమవుతాయని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. వివిధ అంశాలకు సంబంధించి పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఆర్మీ తరఫున ప్రత్యేకంగా అధికారులను నియమించాలని ఆయన కోరారు. హైసదరన్ కమాండ్ సెంటర్ ప్రధాన కార్యాలయాన్ని హైదరాబాద్‌కు మార్చే అంశాన్ని పరిశీలించాలని సిఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు.

## జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలి



**హైదరాబాద్, జనవరి 16 (నిజాయితీ) :**
ఎన్నో ఏళ్లగా జర్నలిజం వృత్తిలో ఉండి నిబద్ధతతో పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్ట్ అయినటువంటి దొంతి రమేష్, పరిపూర్ణాచారి, సుధీర్‌లను అక్రమంగా పోలీసులు అరెస్టు చేయడాన్ని బీసీ సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండిస్తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐఏఎస్ అధికారులను కించపరచారనే ఉద్దేశంతో రాత్రికి రాత్రే సమాజంలో గౌరవమైన స్థానంలో ఉన్న సీనియర్ జర్నలిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం చాలా దారుణమని అన్నారు. మహిళా ఐఏఎస్ అధికారులను వ్యక్తిగతంగా కించపరిచిన విధానాన్ని ఎవరు హర్షించరని, కానీ ఇదే సమయంలో ఎన్‌టీవీలో ప్రసారమైన వార్తకు వృత్తిలో భాగంగా పనిచేస్తున్న జర్నలిస్టులను కాదని, దానికి పూర్తి బాధ్యత యజమాన్యం, ఎడిటర్‌ల దేనని, జర్నలిస్టులది ఏమాత్రం కాదని ఇదే విషయం సిట్ తో దర్యాప్తు చేస్తున్న పోలీసులు గమనించాలన్నారు.ఎన్టీవీలో ప్రసారమైన వార్తకు బాధ్యులుగా యజమాన్యంపై చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తొందరపాటు చర్యలకు పాల్పడకుండా బీసీ జర్నలిస్టులపై మోపిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని, వారిపై ఇప్పటికైనా పోలీస్ విచారణ ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయ అధికారం కోసం, తమ ఆధిపత్యం కోసం జరిగే కొట్లాటలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ జర్నలిస్టులను బలి పశువులు చేయొద్దని, సమగ్రమైన దర్యాప్తు జరిపి బాధ్యులపైన మాత్రమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అలా కాకుండా బీసీ జర్నలిస్టుల పైనే టార్గెట్ గా పనిచేయకూడదని జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వానికి హితవు పలికారు. ఈ సమావేశంలో బొలిశెట్టి రంగారావు, బూర సోమేశ్వర్, మల్లయ్య యాదవ్, భాస్కర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## టిఎస్ ఐపాస్ విధానాన్ని నీతి ఆయోగ్ ప్రశంసించడం తెలంగాణకు గర్వకారణం

### బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**హైదరాబాద్, జనవరి 16 (నిజాయితీ) :**
తమ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కెసిఆర్ రూపకల్పన చేసిన టిఎస్ ఐపాస్ విధానం దేశంలోనే అత్యుత్తమమైనదని సాక్షాత్తు నీతి ఆయోగ్ తన తాజా నివేదికలో ప్రశంసించడం తెలంగాణకు గర్వకారణమని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పేర్కొన్నారు. పారిశ్రామిక రంగంలో తెలంగాణ సాధించిన ప్రగతి, కెసిఆర్ దార్శనికతకు ఈ గుర్తింపే నిలువెత్తు నిదర్శనమని ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను పదేళ్ల కాలంలోనే దేశానికే పారిశ్రామిక దిక్సూచిగా మార్చడంలో టిఎస్ ఐపాస్ పోషించిన పాత్ర అత్యంత కీలకమని కేంద్ర ప్రభుత్వ సంస్థే చెప్పడం గొప్ప విషయమని అభిప్రాయపడ్డారు. పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అడ్డంకులను తొలగించి, సింగిల్ విండో విధానంలో కేవలం 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని అనుమతులు ఇచ్చేలా టిఎస్ ఐపాస్‌ను రూపొందించామని గుర్తుచేశారు. అవినీతికి ఏమాత్రం తావులేని అత్యంత పారదర్శకమైన ఈ విధానాన్ని పదేళ్లపాటు చిత్తశుద్ధితో అమలు చేయడం వల్లే అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని వివరించారు. ఈ విధానం ద్వారా భారీ పరిశ్రమలతో పాటు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్‌ఎంఇ) విభాగంలో రూ. 2.6 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని తెలిపారు. తద్వారా రాష్ట్రంలో 25 లక్షల మందికి పైగా యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా గౌరవప్రదమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం దేశ చరిత్రలోనే ఒక సువర్ణ అధ్యాయమని వ్యాఖ్యానించారు. ప్రపంచ దిగ్గజ సంస్థల నుండి సూక్ష్మ మధ్య తరహా పరిశ్రమల వరకూ అందరూ తెలంగాణకు క్యూకట్టేలా పెట్టుబడిదారుల్లో కొండంత విశ్వాసాన్ని కల్పించిన విప్లవాత్మక విధానం తీసుకొచ్చి పదేళ్లు దాటినా నేటికి టిఎస్ ఐపాస్ ప్రతిష్ట నలుదిశలా మారుమోగుతూనే ఉందని అన్నారు.గతంలోనూ స్వతంత్ర భారత చరిత్రలోనే తొలిసారిగా కెసిఆర్ అమలు చేసిన రైతుబంధు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, టీ -హబ్ వంటి వినూత్న కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించినట్లే, ఇప్పుడు టిఎస్ ఐపాస్‌కు కూడా లభించిందని తెలిపారు. ఇకనైనా కెసిఆర్ ఆనవాళ్లు చెరిపేస్తామనే భ్రమల్లో బతికే అరాచక శక్తులు బుద్ధి తెచ్చుకుంటే మంచిదని.. జై తెలంగాణ..జై కెసిఆర్ అంటూ కెటిఆర్ ట్వీట్ చేశారు.
ప్రాజెక్టులు ప్రారంభం కావడం సంతోషదాయకం కెసిఆర్ హయాంలో ప్రారంభమై, 90 శాతానికి పైగా పనులు పూర్తిచేసుకున్న రెండు ఇరిగేషన్ ప్రాజెక్టులు ప్రారంభం కావడం పట్ల బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా సంతోషం వ్యక్తం చేశారు. 0.98 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించిన చనాక కొరాట బరాజ్ బిఆర్‌ఎస్ హయాంలోనే 95 శాతం పనులు పూర్తయ్యి, సెప్టెంబర్ 2023లో ట్రయల్ రన్ కూడా అయ్యిందని పేర్కొన్నారు. దీనిలో భాగమైన లిఫ్ట్ ఇరిగేషన్ కాంపొనెంట్‌తో కలిపి, ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లోని 89 గ్రామాలకు చెందిన సుమారు 51,000 ఎకరాలకు సాగునీరు అందిస్తుందని తెలిపారు. 2016లో మహారాష్ట్ర ప్రభుత్వంతో అంతర్రాష్ట్ర ఒప్పందం కుదుర్చుకుని మొదలుపెట్టిన ప్రాజెక్ట్ ఇది అని గుర్తు చేశారు. అదేవిధంగా కెసిఆర్ హయాంలోనే సదర్‌మాట్ బరాజ్ 90 శాతం ప్రాజెక్టు పూర్తయ్యిందని,దీని నీటి నిల్వ సార్థ్యం 1.58 టిఎంసిలు అని పేర్కొన్నారు. నిర్మల్, జగిత్యాల జిల్లాల్లోని 18,000 ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తుందని అన్నారు. కెసిఆర్ పాలనలో తెలంగాణ దశాబ్ది (2014-2023), నెర్రెలుబారిన ఈ నేలను దేశానికి ధాన్యాగారంగా మార్చిందని వ్యాఖ్యానించారు.

## ఎర్ర బస్సు కూడా రాని ఆదిలాబాద్ కు ఎయిర్‌బస్సును తీసుకువస్తాం: రేవంత్



**ఆదిలాబాద్, జనవరి 16 (నిజాయితీ) :**
ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసి రైతుల పొలాల్లో సాగు జలాలు పారించే సంకల్పంతో పని చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పాలన అంటే రైతు సంక్షేమం, రైతు క్షేత్రం సస్యశ్యామలం, సాగు జలాలతో పచ్చటి పొలాలను తడపడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలం హతిఘాట్ లో చనాక- కొరాటా పంప్ హౌస్ ను రేవంత్ రెడ్డి ప్రారంభించారు. లోయర్ పెనుగంగ ప్రాజెక్టు ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు. నిధులు, ప్రాజెక్టులు, ఎయిర్‌పోర్టుల కోసమే ప్రధాని మోడీని కలుస్తున్నామని ఆయన నాకు చుట్టం కాదన్నారు. ప్రధాని మోడీకి ఇవ్వాల్సిన గౌరవం ఇస్తున్నామని, కావాల్సిన నిధులు అడుగుతున్నామన్నారు. పదేళ్లు ఏలినవారు కేంద్రం నుంచి నిధులు తీసుకురాలేదని, ఇలాంటి చిక్కుముళ్లు విప్పుకుంటూ రాష్ట్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.
ఎర్ర బస్సు కూడా రాని ఆదిలాబాద్ జిల్లాకు ఎయిర్‌బస్సును తీసుకువస్తామని, ప్రధాని మోడీ చేతులమీదుగా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు శిలాఫలకం వేయిస్తామన్నారు. ప్రతీ 3 నెలలకు ఒకసారి మోడీ దగ్గరకు వెళ్తున్నామని, ప్రతీ 10 రోజులకు ఒకసారి కేంద్ర మంత్రులను కలుస్తున్నామని, రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టుల కోసం విజ్ఞప్తులు చేస్తున్నామన్నారు. ఆదిలాబాద్ జిల్లా పోరాటాల పురిటి గడ్డ అని, జల్ జంగిల్ జమీన్ పోరాటం ఎప్పటికీ స్ఫూర్తిదాయకమన్నారు. అత్యంత వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాకు ఎంతో న్యాయం జరగాల్సి ఉందని, పాలమూరు జిల్లాతో సమానంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఉక్కు సంకల్పంతో ఉందన్నారు. గత పదేళ్లలో ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మెహిదీపట్నం స్కైవాక్ మార్చిలో అందుబాటులోకి...?

### చివరి దశకు చేరుకున్న పనులు రెండేళ్లుగా నిర్మాణం... ఈ ప్రాజెక్ట్ కోసం రూ. 32.47 కోట్ల ఖర్చు



**హైదరాబాద్, జనవరి 16 (నిజాయితీ) :**
మెహిదీపట్నం స్కైవాక్ మార్చిలో ప్రజలకు అందుబాటులోకి రానుంది. నిత్యం రద్దీగా ఉండే ఈ జంక్షన్‌లో పాదాచారుల భద్రత కోసం నిర్మిస్తున్న ఈ స్కైవాక్ నిర్మాణం దాదాపు పూర్తి కావొచ్చింది. మార్చిలో ప్రారంభమయ్యే ఈ ప్రాజెక్ట్, నగరవాసులకు కొత్త అనుభూతిని అందించనుంది. ప్రస్తుతం స్కైవాక్ వద్ద చివరి దశ పనులు జరుగుతున్నాయని హెచ్‌ఎండిఏ అధికారులు తెలిపారు. దాదాపు రెండేళ్లుగా నిర్మాణంలో ఉన్న ఈ ప్రాజెక్ట్ కోసం రూ. 32.47 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు వెల్లడించారు. మెహిదీపట్నం జంక్షన్ అత్యంత రద్దీగా ఉండే ట్రాఫిక్ మార్గాల్లో ఒకటి. ప్రతిరోజూ లక్షలాది వాహనాలు ఈ జంక్షన్ మీదుగా ప్రయాణిస్తాయి. ఈ జంక్షన్ మీదుగా మొయినాబాద్, నార్సింగి, పరిగి, శంషాబాద్, తాండూర్, వికారాబాద్, హైటెక్ సిటీ, రాయదుర్గం, మణికొండ, నార్సింగి, కోకాపేట్, నానక్‌రాంగూడలకు వెళ్లవచ్చు. దీంతో ఈ జంక్షన్‌లో విపరీతమైన రద్దీ ఉంటుంది. దీనికి తోడు పాదాచారులు ఎక్కువగా తిరుగుతుండటంతో ఈ మార్గంలో ట్రాఫిక్ జామ్, పెద్ద సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజల భద్రత దృష్ట్యా స్కైవాక్ నిర్మించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

**స్కైవాక్ నిర్మాణం 340 మీటర్ల పొడవు**
ఈ స్కైవాక్ నిర్మాణం 340 మీటర్ల పొడవు ఉంటుంది. ఇది మెహిదీపట్నం బస్టాప్ నుంచి జంక్షన్ ఎదురుగా ఉన్న డిఫెన్స్ ల్యాండ్ వరకు విస్తరించి ఉంటుంది. ఇందులో 160 మీటర్లు ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ వైపు, 180 మీటర్లు మల్లేపల్లి వైపు ఉంటాయి. అధికారులు ఈ స్కైవాక్‌ను ఆర్చ్-స్టైల్ ఎలివేషన్‌తో ఆధునిక సౌకర్యాలతో రూపొందించారు. ఉప్పల్ స్కైవాక్ నుంచి ప్రేరణ పొంది దీనిని నిర్మించారు. ఉప్పల్ స్కైవాక్ ట్రాఫిక్ జామ్‌లను తగ్గించడంలో సహాయపడటమే కాకుండా, ప్రజలు సేదతీరేందుకు అనుకూల ప్రదేశంగా మారింది. ప్రస్తుతం మెహిదీపట్నం స్కైవాక్‌ను అలానే నిర్మిస్తున్నారు. ఈ స్కైవాక్‌లో లోపలికి, బయటకు వెళ్లడానికి 5 ద్వారాలు ఉన్నాయి. నడవడానికి వీలుగా ఉండే మార్గాలు 4-5 మీటర్ల వెడల్పుతో ఉన్నాయి. స్కైవాక్‌లో 12 లిఫ్టులను ఏర్పాటు చేశారు. ప్రతి లిఫ్ట్ ఒకేసారి 20 మంది వరకు తీసుకెళ్లగలదు.

## మేడారంలో ఈ నెల 18వ తేదీన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

### అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిన సిఎస్

**హైదరాబాద్, జనవరి 16 (నిజాయితీ) :**
రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈసారి సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ములుగు జిల్లా మేడారంలో జరుగనుంది. ఈ నెల 18వ తేదీన ఆదివారం సాయంత్రం 5 గంటలకు మేడారంలోని హరిత హోటల్ అందుకు వేదిక కానుంది. అయితే, సాధారణంగా సచివాలయంలో జరిగే కేబినెట్ సమావేశాన్ని ఈసారి గిరిజన ప్రాంతమైన మేడారంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సమావేశంలో ప్రధానంగా మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లను పర్యవేక్షించడంతో పాటు, గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లుగా తెలుస్తోంది. అదే విధంగా రాష్ట్ర బడ్జెట్, మున్సిపల్ ఎన్నికలు, రైతు భరోసా వంటి కీలక అంశాలపై సమావేశంలో చర్చించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లుగా సమాచారం. ఈ కీలక భేటీకి సంబంధించి ఇప్పటికే డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ప్రభుత్వ సలహాదారులకు సమాచారం అందింది. మంత్రివర్గ భేటీకి సంబంధించి ములుగు జిల్లా కలెక్టర్‌తో పాటు ఎస్పీలు తగిన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.

శనివారం
జనవరి 17, 2026
TGTEL/25/A3750 ... నిజమే ...
నిజాయితి
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక



# ఎనిమిదోని తండాలో శ్రీ వీర ఆంజనేయ స్వామి జాతర మహోత్సవం



**మహబూబ్‌నగర్, జనవరి 16 (నిజాయితి) :** మహబూబ్‌నగర్ జిల్లా తండాలో శ్రీ వీర ఆంజనేయ స్వామి జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీ అధ్యక్షులు సంజేవ్ ముదిరాజ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను కాపాడుకుంటూ ఇలాంటి జాతరలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ అసెంబ్లీ కోఆర్డినేటర్ బెక్కరి మధుసూదన్ రెడ్డి, ఎంపీ ప్రవీణ్ కుమార్, ఎనిమిదోని తండా సర్పంచ్ బిమీ భాయ్, లింగం నాయక్, ఉపసర్పంచ్ ఎన్. నరేష్,
గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులుపాల్గొని జాతరను విజయవంతం చేశారు. జాతరకు భారీ సంఖ్యలో భక్తులు హాజరై శ్రీ వీర ఆంజనేయ స్వామి ఆశీస్సులు పొందారు.

# సంక్రాంతి పండుగ వేడుకలు

**మహబూబ్‌నగర్, జనవరి 16 (నిజాయితి) :** మహబూబ్‌నగర్ జిల్లా అల్లీపూర్ గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మగ్గుల పోటీలు మరియు క్రికెట్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహబూబ్ నగర్ జిల్లా డిసిసి అద్యక్షులు సంజీవ్ ముదిరాజ్ హాజరై, విజేతలకు బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీ అధ్యక్షులు సంజేవ్ ముదిరాజ్ మాట్లాడుతూ, గ్రామీణ క్రీడలు మరియు సంప్రదాయ పండుగలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితా రెడ్డి, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, మహబూబ్‌నగర్ అసెంబ్లీ కోఆర్డినేటర్ బెక్కరి మధుసూదన్ రెడ్డి, అల్లీపూర్ గ్రామ సర్పంచ్ గోటూరి విజయలక్ష్మి, ఉప సర్పంచ్ ఈ. చంద్రకళ, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ఫణీంద్ర గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఎంపీ ప్రవీణ్ కుమార్, వడ్ల రాకేష్, అల్లీపూర్ గ్రామ పెద్దలు మరియు కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# అభివృద్ధి ప్రదాత సిఎం రేవంత్ :

## రాష్ట్ర యువజన, క్రీడలు మరియు పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

**మహబూబ్‌నగర్, జనవరి 16 (నిజాయితి):** అభివృద్ధి ప్రదాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పాలమూరు ముద్దుబిడ్డ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని రాష్ట్ర యువజన, క్రీడలు మరియు పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పాల్గొనే సభా ప్రాంగణ ఏర్పాట్లను స్థానిక మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి , జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్‌తో కలిసి పర్యవేక్షించారు. అనంతరం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, మహబూబ్‌నగర్ పట్టణం మున్సిపాలిటీగా 75 వసంతాలు పూర్తి చేసుకుంటున్న శుభ సందర్భంగా, ఉమ్మడి జిల్లాకు గుండెకాయ అయిన మహబూబ్‌నగర్ నగరంలో రూ.1463 కోట్ల విలువైన పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు శంకుస్థాపన చేయడానికి మహబూబ్‌నగర్‌కు విచ్చేయనున్నారని తెలిపారు . గత ప్రభుత్వం మహబూబ్‌నగర్ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం



చేసిందని విమర్శించారు. ఈ మట్టి బిడ్డగా, ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి ఫలాలు అందించేందుకు వస్తున్న ముఖ్యమంత్రికి అపూర్వ స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. సరస్వతి పుత్రులకు నిలయమైన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని, జడ్చర్ల, దేవరకద్ర, మహబూబ్‌నగర్ మధ్య ప్రాంతంలో ట్రిపుల్ ఐటీ కళాశాల ఏర్పాటు కోసం ముఖ్యమంత్రి రేపు మహబూబ్‌నగర్‌కు వస్తున్నారని తెలిపారు. అదేవిధంగా, మహబూబ్‌నగర్ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు రూ.603 కోట్లతో, శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.220 కోట్లతో, ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్లతో పాటు, మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలను డీమ్డ్ యూనివర్సిటీగా అభివృద్ధి చేయడానికి రూ.20 కోట్లతో సహా అనేక అభివృద్ధి పథకాలకు రేపు శంకుస్థాపనలు చేయనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ఈ చారిత్రక కార్యక్రమానికి అత్యధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని, ముఖ్యమంత్రికి అపూర్వ స్వాగతం పలకాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయేందిర బోయి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, బెక్కెరి మధుసూదన్ రెడ్డి, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జీ గోనెల శ్రీనివాసులు, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు శాంతన్న యాదవ్, ఫయాజ్, తాహెర్, బాలస్వామి, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా ప్రజాప్రభుత్వం



**తెల్కపల్లి, జనవరి 16 (నిజాయితి) :** రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందని తెల్కపల్లి మేజర్ గ్రామ పంచాయతి సర్పంచ్ కొమ్ము చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మార్నింగ్ వాక్‌లో భాగంగా 9వ వార్డులో పర్యటించిన ఆయన వార్డులోని ప్రజలతో ముచ్చటించారు. మంచినీటి సమస్యలు, పారిశుద్ధ్య సమస్యలతో పాటు కుటుంబాల ఆర్థిక మరియు ఆరోగ్య సమస్యల గురించి చర్చించారు. ప్రాజా పాలన ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ఎవరెవరికి ఏ విధంగా అందుతున్నాయో తెలుసుకున్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ , ఇందిరమ్మ చీరలు, ఇందిరమ్మ ఇళ్ల గురించి పూర్తిగా చర్చించారు. నిరుపేదలకు అండగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని ప్రజలకు సర్పంచ్ కొమ్ము చంద్రశేఖర్ నమ్మకంగా వివరించారు. ఆయన వెంట వార్డు సభ్యులు కొమ్ము ఎల్లస్వామి, వార్డు సభ్యురాలు భారీగారి భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

# ఘనంగా శివ దీక్షా స్వాముల శివ పూజ కార్యక్రమం..



**నాగర్‌కర్నూల్, జనవరి 16 (నిజాయితి) :** నాగర్ కర్నూలు పట్టణంలోని మధుర నగర్ కాలనీ రూబీ గార్డెన్ దగ్గర కిషన్ నాయక్ శివ స్వామి నివాసంలో శివ పూజ కార్యక్రమాన్ని శుక్రవారం నాడు శివదీక్షా స్వాములు ఘనంగా శివ పడి పూజ నిర్వహించారు. శివ స్వాముల పూజ కార్యక్రమాన్ని గ ు ర ు స్వాముల ు బ ు జ్జన్న, వి నోద్, న ు రేష్ ఆధ్వర్యంలో శివ పూజ నియమ ని య ు వ గా వ ళి తో పరమశివలింగానికి అభిషేకం చేస్తూ,పూజా నియమావళిని ఘనంగా నిర్వహించారు. శివ స్వాములు శివపాటాలతో మారు మ్రోగించారు. శివ దీక్ష తీసుకున్న స్వాములకు భజన కీర్తనలతో కొనసాగించారు. అనంతరం తీర్థ ప్రసాదములతో పాటు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా గురుస్వాములకు కండువాలతోసత్కరించారు. ఈకార్యక్రమంలో గురు స్వాములు కొండకింది మాధవరెడ్డి,కురుమూర్తి, శివ,అడివయ్య, అదేవిధంగా శివ స్వాములు చిట్యాల వెంకటేష్,గోపాల్ నాయక్, కాశి,నిరంజన్,చెర్రీ, శ్రీకాంత్,శివ,వెంకటేష్, రమేష్,నాగరాజు, అదిరేపల్లి శ్రీను,రవి, మల్లేష్,శివ, మధు,అశోక్ తో పాటు శివ స్వాములు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# మున్సిపల్ రిజర్వేషన్లు పకడ్బందీగా ఖరారు చేయాలి:

## కలెక్టర్ బి.ఎం. సంతోష్

**గద్వాల, జనవరి 16 (నిజాయితి) :** పురపాలిక ఎన్నికల నిర్వహణలో భాగంగా జనాభా, ఓటర్ల సంఖ్య ప్రాతిపదికన రిజర్వేషన్లను అత్యంత పకడ్బందీగా ఖరారు చేయాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.



**ప్రధానాంశాలు:**

- మహిళా రిజర్వేషన్లు: శనివారం ఉదయం 11 గంటలకు ఆయా మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా మహిళా రిజర్వేషన్లను ఖరారు చేస్తారు.
- పోలింగ్ కేంద్రాలు: ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ స్టేషన్ల ఏర్పాటును నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి.
- నిష్పాక్షికత: ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బంది అదే మున్సిపాలిటీకి చెందిన వారు కాకుండా ఇతర మండలాల వారిని నియమించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

**శిక్షణ:** ఎన్నికల నిర్వహణపై రిటర్నింగ్, ప్రిసైడింగ్ అధికారులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని సూచించారు.
ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగేంద్రం, మున్సిపల్ కమిషనర్లు జానకి రామ్ సాగర్, శంకర్ నాయక్, సైదులు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన అచ్చంపేట ఎమ్మెల్యే



**అచ్చంపేట, జనవరి 16 (నిజాయితి) :** అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామానికి చెందిన కుల నిర్మూలన పోరాట సమితి నాగర్ కర్నూల్ జిల్లా కో- కన్వీనర్ (రిటైడ్ హెచ్.ఎం) మంతటి పర్వతాలు సతీమణి మంతటి నారాయణమ్మ ఇరోజు ఉదయం అకాల మరణం చెందరు, విషయం తెలుసుకొని వారి స్వగ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులను అచ్చంపేట ఎమ్మెల్యే, టిపిసిసి ఉపాధ్యకులు, డిసిసి అధ్యక్షులు డాక్టర్ వంశీకృష్ణ పరామర్శించారు.

# సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు నటి అనసూయ ఫిర్యాదు



**హైదరాబాద్, జనవరి 16 (నిజాయితి) :** తనపై ఆన్‌లైన్ వేధింపులు పెరుగుతున్నాయని నటి అనసూయ సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిసెంబర్ 23 నుంచి సోషల్ మీడియా వేదికగా తనను లక్ష్యంగా చేసుకుని అశ్లీల వ్యాఖ్యలు, లైంగిక దూషణలు చేయడమే కాకుండా బెదిరింపులకు కూడా పాల్పడుతున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

అనసూయ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మొత్తం 42 మందిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ కేసులో బొజ్జ సంధ్యారెడ్డి, ప్రియాచౌదరి గోగినేని, పావని, శేఖర్‌బాషా, రజని తదితరులపై కేసులు నమోదు చేసినట్లు సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు తెలిపారు

TGTEL/25/A3750
... నిజమే ...
నిజాయితి
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక
శనివారం, జనవరి 17, 2026



# రొట్టెల పిండి పంపిన గుత్తెదారు - ప్రాణం మీదికి తెచ్చుకున్న కూలీ



**తెల్కపల్లి, జనవరి 16 (నిజాయితి) :** సంక్రాంతి రొట్టెల పండుగనాడు రొట్టెలు చేయమన్నందుకు ఆరంభమైన గొడవ ప్రాణాలనే బలిగొన్నది నాగర్‌కర్నూల్ జిల్లా తెల్కపల్లి మండల లక్నారం గ్రామానికి చెందిన కలుకుల మశన్న చిన్న కొడుకు మన్నెం చంద్రు నల్లగొండలో హత్యకు గురయ్యాడు. మృతుని అన్న ఎల్లస్వామి పక్కనే ఉన్న రొట్టెలు చేసే అమ్మాయిని మాకు కూడా రొట్టెలు చేస్తారా అని అడిగిన పాపానికి ఎల్లస్వామి కుటుంబంపై మూకుమ్మడిగా దాడిచేసి విచక్షణా రహితంగా కొట్టారు. ఏమాత్రం సంబంధం లేని చంద్రు అకారణంగా చనిపోయాడు. చంద్రు భార్యకు తీవ్ర గాయాలైన కారణంగా నల్లగొండ ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. మృతునికి 6 నెలల చంటిపాప, 2 ఏళ్ళ మరో పాప ఉన్నారు. ఇదిలా ఉండగా విషయం తెలిసిన గ్రామ సర్పంచ్ దూళ్ల సువర్ణ బాలు, గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ ఊశన్న, దాసర్ల నిరంజన్, దాసర్ల శ్రీరాములు, దాసర్ల సుదర్శన్ మృతుని కులపెద్దలు, గ్రామస్తులు కొందరు కలిసి నల్లగొండకు చేరుకున్నారు.

అకారణంగా దాడిచేసిన శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన వ్యక్తులపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తిమ్మాజిపేట మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన పెద్ద మేస్త్రి కింద రెండు గుంపులను ఇద్దరు చిన్న మేస్త్రీలు తీసుకుని వెళ్లారు మొదటి గుంపులో ఉన్న సుమారు 25 మందికి నువ్వుల రొట్టెలు చేసుకునేందుకు మొదటి మేస్త్రి అయిన పద్దకొత్తపల్లికి చెందిన బాలస్వామి రొట్టెల పిండిని పంపించాడు. కానీ రొట్టెలు చేసేందుకు గుంపులో ఎవ్వరూ లేకపోవడంతో పండగ రొట్టెలే కదా మాకు కూడా చేసి ఇస్తారా అని రెండవ మేస్త్రీ అయిన దన్వాడ మండలానాకి చెందిన బాలరాజు గుంపులోని రొట్టెలు చేసే ఆమెను మృతుని అన్న ఎల్లస్వామి అడిగాడు. అది నచ్చని ఆమె భర్త, కుటంబీకులు ఎల్లస్వామి కుటుంబంతో గొడవ పడ్డారు. అదంతా సద్దుమనిగాక ఈ రెండు గుంపులకు సంబంధంలేని మూడవ గుంపు వాళ్లు ఎల్లస్వామి కుటుంబం పై విచక్షణా రహితంగా దాడికి దిగారు.

కారణం లేకుండా మూడవ గుంపువాళ్లు మూకుమ్మడిగా ఎల్లస్వామి కుటంబాన్ని ఎందుకు టార్గెట్ చేశారో దాడి చేసిన వారికి కూడా స్పష్టత లేకపోవడం విడ్డూరంగా ఉందని కేసు దర్యాప్తులో భాగంగా మూడవ గుంపుకు చెందిన శ్రీకాకులం కంపనీ వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్న ఎస్ఐ వై.సైదులు వివరిస్తున్నారు.



# ఉంటవా? పోతవా?

## మహిళా అధికారికి సోషల్ మీడియాలో ఆడియో వైరల్

**గద్వాల, జనవరి 16 (నిజాయితి) :** జోగులాంబ గద్వాల జిల్లా ఔట్సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు ఇవ్వాలని ఓ అధికారిణికి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఫోన్లో బెదిరించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిం ది. మొదట తన కుమారుడితో ఫోన్ చే యించి తర్వాత తానే ఫోన్ తీసుకొని 'నేను ఫోన్చేస్తే ఎందుకు ఎత్తడంలేదు' అని నిలదీశారు. తాను క్లాసులో ఉ న్నందున ఫోన్ ఎత్తలేదని చెప్పారు. ఉద్యోగుల జాబితా కలెక్టర్కు ఇచ్చా నని, కావాలంటే అక్కడ తీసుకోవాలని సమాధానం ఇవ్వడంతో ఆగ్రహించిన మాజీ ఎమ్మెల్యే.. నీవు ఇక్కడ ఉంటా వా? లేకుంటే పోతావా? అని బెదిరిం చారు. ఉండమంటే ఉంటా? పొమ్మం టే పోతా? అని ఘాటుగా బదులిచ్చా రు. ప్రస్తుతం ఆ ఆడియో సోషల్ మీడి యాలో వైరల్ అయ్యింది. 15 రోజుల క్రితం ఆ అధికారి మాజీ ఎమ్మెల్యే ఒ త్తిడి తట్టుకోలేక బదిలీపై వనపర్తి వెళ్లిన ట్టు సమాచారం. ఇదే జిల్లాలో మాజీ ఎమ్మెల్యే, అనుచరుల బెదిరింపులపై విచారణ చేస్తున్నట్టు కో దండాపురం ఎస్సై తరుణ్కుమార్రెడ్డి తెలిపారు

# శ్రీ ఉమామహేశ్వర దివ్య క్షేత్రంలో ఘనంగా శివపార్వతుల కళ్యాణం...

## ముఖ్యఅతిథిలుగా పాల్గొన్న శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ దంపతులు



**అచ్చంపేట, జనవరి 16 (నిజాయితి) :** అచ్చంపేట మండలం రంగాపూర్ గ్రామ సమీపంలో నల్లమల్ల కొండ పై, శ్రీశైల ఉత్తర ద్వారంగా పేరుగాంచిన ప్రముఖ దైవ క్షేత్రమైన శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు....

పార్వతీ దేవి శివుని భర్తగా పొందడానికి ఘోర తపస్సు చేసిన మహిమస్థలం ఉమామహేశ్వర క్షేత్రం అక్కడ శివుడు ప్రత్యక్షమై వరం ఇచ్చినందున ఈ క్షేత్రానికి ఆ పేరు వచ్చిందని పురాణాలు చెబుతున్నాయి; ఇది నల్లమల కొండల్లో ఉంది, ఇక్కడ అమ్మవారు తపస్సు చేసే భంగిమలో దర్శనమిస్తారు...

శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం చైర్మన్ బిరం మాధవరెడ్డి మరియు పాలకమండలి సభ్యులు, ఈఓ ఆధ్వర్యంలో కళ్యాణం ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పాలకమండలి డైరెక్టర్లు, ఆలయ అధికారులు,భక్తులు అధిక సంఖ్యలో



# సీఎం పర్యటన నిమిత్తము భారీ బందోబస్తు




**గద్వాల, జనవరి 16 (నిజాయితి) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా పర్యటన సందర్భంగా, జడ్చర్ల మండలం చిట్టి బోయిన్పల్లి గ్రామంలో ఐఐఐటి కళాశాల భూమి పూజ కార్యక్రమం మరియు క్రిస్టియన్‌పల్లి లోని ఎంవీఎస్ డిగ్రీ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్న బహిరంగ సభ కోసం మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు యంత్రాంగం విస్తృత స్థాయిలో భద్రతా మరియు బందోబస్తు ఏర్పాట్లు చేసింది.

ఈ పర్యటనను దృష్టిలో ఉంచుకొని, జోగులాంబ జోన్7 డీఐజీ ఎల్.ఎస్. చౌహన్, ఐపిఎస్ ఆధ్వర్యంలో, ముఖ్యమంత్రి రాక సజావుగా జరిగేలా, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శంకుస్థాపన ప్రాంగణం, బహిరంగ సభ ప్రాంగణం, ప్రయాణ మార్గాలు మరియు పరిసర ప్రాంతాలలో సమర్థవంతమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ప్రత్యేక నియంత్రణ చర్యలు చేపట్టారు.

ఈ బందోబస్తు విధుల నిమిత్తం 01 ఎస్పీ, 07 అడిషనల్ ఎస్పీలు, 10 డీఎస్పీలు, 34 సీఐలు, 77 ఎస్సైలు, 182 ఏఎస్ఐలు/హెడ్ కానిస్టేబుళ్లు, 741 పీసీలు/వుమెన్ పీసీలు, 110 హోంగార్డులు, 22 వుమెన్ పీసీలు/వుమెన్ హోంగార్డులు మొత్తం 1184 మంది పోలీసు అధికారులు మరియు సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. అనంతరం ఏఎస్ఎన్ గార్డెన్ నందు, బందోబస్తు విధుల నిమిత్తం నియమించబడిన అధికారులు మరియు సిబ్బందికి డీఐజీ ఎల్.ఎస్. చౌహన్ ఏర్పాట్లపై సమగ్ర సూచనలు అందజేశారు. ముఖ్యంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, ట్రాఫిక్ సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని, వీఐపీల భద్రతను దృష్టిలో ఉంచుకొని అన్ని విభాగాలు సమన్వయంతో విధులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు.

మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు యంత్రాంగం సమన్వయంతో చేపట్టిన ఈ భద్రతా ఏర్పాట్లతో ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా, సురక్షితంగా కొనసాగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

ఈ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్, ఐపీఎస్, ఎస్పీ నగర్ కర్నూలు, అదనపు ఎస్పీ చీదీ రత్నం,ఇగాా= అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఇతర అదనపు ఎస్పీ లు, ఇూా వెంకటేశ్వర్లు ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్‌నగర్, జనవరి 16 (నిజాయితి) :** మహబూబ్‌నగర్ నగరంలోని కిద్వాయిపేట, 47వ వార్డులో ముడా నిధులు రూ.10 లక్షలు వెచ్చించి మహిళాసంఘం భవనంలో మిగిలిన పనులు పూర్తి చేయగా, ఆ భవనాన్ని గౌరవ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళాసంఘాల సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇలాంటి భవనాలు ఎంతో దోహదపడతాయని, మహిళాసంఘాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, మహిళల సాధికారతకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గోవింద్, నాయకులు చిన్న రాజు, బాసిత్, చంద్రమౌళి, ఖాజా, పార్టీ నాయకులు, బి సి మహిళ సంఘం అధ్యక్షురాలు సునీత ముదిరాజ్ ,రేవతి, చిట్టెమ్మ, మహిళా సంఘాల సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజ ఆరోగ్య వ్యవస్థలో గిరిజన వైద్యులకు భాగస్వామ్యం



**హైదరాబాద్, జనవరి 16 (నిజాయితి) :** దేశ వ్యాప్తంగా గిరిజన వైద్యులను (ట్రైబల్ హీలర్స్) సమాజ ఆరోగ్య వ్యవస్థలో భాగస్వాములుగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళుతోందని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరాం అన్నారు. దీనిలో భాగంగా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ శుక్రవారం హైదరాబాద్‌లోని కన్హా శాంతి వనం వేదికగా జాతీయ స్థాయి సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం ప్రారంభ సమావేశానికి కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరాంతో పాటు సహాయ మంత్రి దుర్గాదాస్ ఉయికే, తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, ప్రముఖ వైద్య, పరిశోధనా సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశంలో జాతీయ స్థాయిలో గిరిజన వైద్యుల సామర్థ్యాభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుడుతూ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భువనేశ్వర్ ఐసీఎంఆర్ -ప్రాంతీయ వైద్య పరిశోధనా కేంద్రం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.

# కబడ్డీ విజేతలకు ప్రైస్‌మనీ అందజేత



**తెల్కపల్లి, జనవరి 16 (నిజాయితి) :** లక్నారం గ్రామ కాంగ్రెస్ పార్టీ మరియు సురభి విష్ణువర్ధన్ రావు ఆధ్వర్యంలో ఇవ్వాళ స్కూల్ దగ్గర కబడ్డీ ఆడించడం జరిగినది అందులో మొదటి బహుమతి అందుకున్న వారి లో నవీన్ శాలివాహన టీం ఫస్ట్ ప్రైస్ జూనియర్ టీమ్

సెకండ్ ప్రైజ్ రాయపాకుల భాను టీం గెలవడం జరిగినది ఇందులో పాల్గొన్న వారిలో గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు వార్డు మెంబర్స్ పాల్గొనడం జరిగినది ఇందులో గెలపొందిన సీనియర్స్ వారికి ప్రైజ్ మనీ ఫస్ట్ ప్రైజ్ 4000, సెకండ్ ప్రైస్ 3000, థర్డ్ ప్రైస్ 1000 ప్రైజ్ మనీ ఇవ్వడం జరిగినది. జూనియర్స్‌లో గెలుపొందిన వారికి ఫస్ట్ ప్రైస్ 4000, సెకండ్ ప్రైజ్ 3000, థర్డ్ ప్రైస్ 1000 రూపాయలు అందజేయడం జరిగింది.

# విజేతలకు బహుమతులు ప్రధానం



**తెల్కపల్లి, జనవరి 16 (నిజాయితి) :** తెల్కపల్లి మండల పరిదిలోని గౌరారం గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సాయి లింగేశ్వర యూత్ ఆధ్వర్యంలో జీపీఎల్ జిపిఎల్ నిర్వహించడం జరిగింది తేది గురువారం రోజున గెలుపొందిన వారికి సర్పంచి బిరుదు మల్లీశ్వరి రఘు కుమార్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చెయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి వార్డు మెంబర్స్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# చంద్రబాబు హింసా రాజకీయాలు మూల్యం చెల్లించక తప్పదని వైఎస్ జగన్ హెచ్చరిక

**అమరావతి :** ఏపీలోని గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త, దళితుడు మందా సాల్మన్ హత్యకు గురయ్యాడు. ఈ ఘటనను వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రంగా ఖండిస్తూ ట్వీట్ చేశారు. రాజకీయ కక్షలతో ఇంకా ఎంతమంది ప్రాణాలను బలితీసుకుంటారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పదవిలో ఉండి కూడా రెడ్‌బుక్ రాజ్యాంగం, పొలిటికల్ గవర్నెన్స్ ముసుగులో ఇన్ని అరాచకాలకు పాల్పడతారా అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. హింసారాజకీయాలకు పాల్పడుతున్న చంద్రబాబు ను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరని, ఇలాంటి ఘటనలకు మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనారోగ్యంతో ఉన్న తన భార్యను చూడ్డానికి సాల్మన్ సొంత గ్రామానికి వెళ్తే ఇనుప రాడ్లతో కొట్టి దారుణ హత్యచేసి, సాల్మన్‌పైనే తప్పుడు ఫిర్యాదు చేయడం దారుణమని అన్నారు. ఇలాంటి దారుణాలు



చేయడానికా మీరు అధికారంలోకి వచ్చిందా అంటూ మండిపడాడరు. ఈ ఘటన ముమ్మాటికీ వైయస్సార్‌సీపీని భయపెట్టడానికి, కట్టడిచేయడానికి మీరు, మీ పార్టీవారి ద్వారా, కొంతమంది పోలీసులు ద్వారా చేస్తున్న చేయిస్తున్న రాజకీయ హింసాత్మక దాడుల పరంపరలో భాగమేనని ఆరోపించారు. ఎమ్మెల్యే, పోలీసుల బెదిరింపులతో పిన్నెల్లి గ్రామం నుంచి వందలకొద్దీ వైయస్సార్ కార్యకర్తల కుటుంబాలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారని వెల్లడించారు. పౌరులకు రక్షణ కల్పించడం, వారు స్వేచ్ఛగా తమ జీవితాలను గడిపేలా చూడ్డం మీ బాధ్యత కాదా? అంటూ నిలదీశారు. ముఖ్యమంత్రిగా ఉండి రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఏది విత్తుతారో అదే రేపు పండుతుందన్నది ఎప్పుడూ మరిచిపోకూడదు. టీడీపీవారి చేతిలో హత్యకు గురైన సాల్మన్ కుటుంబానికి వైయస్సార్‌సీపీ అండగా ఉంటూ ఆదుకుంటుందని అన్నారు.

# సంక్రాంతి సంబరాలు గిరిజన యువకులతో వాలీబాల్ ఆడిన హోంమంత్రి

**అనకాపల్లి, జనవరి 16:** కోటవురట్ల మండలం గొట్టివాడ శివారులో ఉన్న మారుమూల గిరిజన గ్రామం అణుకులో హోం మంత్రి వంగలపూడి అనితశుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి గిరిజనులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన మంత్రి.. గిరిజనులతో కలిసి సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. కనుమ పండగ సందర్భంగా గిరిపుత్రులతో ఎంతో సంతోషంగా గడిపారు. గ్రామస్థులు మంత్రి అనితను 'అనితమ్మ.. మా గుండె' అంటూ కొనియాడారు. 'అనితమ్మ రావడం మాకు పెద్ద పండుగ' అని ఆనందం వ్యక్తం చేశారు. గతంలో రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఎన్నో ప్రాణాలు కోల్పోయినట్లు గిరిజనులు గుర్తుచేశారు. ఇప్పుడు రోడ్డు మంజూరు చేయించినందుకు మంత్రి అనితకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పేరుపేరునా పలకరిస్తూ..గ్రామంలోని పరిదేశమ్మ తల్లి ఆలయాన్ని మంత్రి అనిత దర్శించుకున్నారు. గిరిజనులతో ముఖాముఖి సంభాషణ జరిపి, వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. అక్కడి ప్రజలను పేరుపేరునా పలకరించి వారి యోగక్షేమాలు అడిగారు. చిన్నారులతో ఆడుకుని.. వారికి పుస్తకాలు, గిరిజనులకు సంక్రాంతి కానుకలు అందజేశారు. గిరిజనులకు స్వయంగా భోజనాలు వడ్డించి, తన



కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు అనిత. మంత్రి కుమారుడు నిఖిల్.. అణుకు యువకులకు క్రికెట్ కిట్లు, స్పోర్ట్స్ టీషర్టులు అందజేశారు. మంత్రి అనిత, కుమారుడు నిఖిల్‌తో పాటు కుటుంబ సభ్యులు ఆ గ్రామ యువకులతో కలిసి వాలీబాల్ ఆడారు. అనంతరం.. చిన్నారుల డ్యాన్స్‌ను అభినందించారు. గిరిజనులు పండించిన కూరగాయలు, పంటలను మంత్రికి అణుకు ప్రజలు బహూకరించారు. సంతోషంగా ఉండా లి: హోంమంత్రిగ్రామస్థులతో మాట్లాడిన మంత్రి అనిత మాట్లాడుతూ.. 'మీతో ప్రశాంతంగా పండుగ చేసుకోవాలని ఇక్కడకు వచ్చాను. మీ అందరితో కలిసి పండుగ చేసుకోవడం నా పూర్వ జన్మ సుకృతం. నా పిల్లలను కూడా తీసుకువచ్చాను. మీ గ్రామానికి ఏమి కావాలో అన్నీ చేస్తాను. రూ. 2.50 కోట్లతో రోడ్డు మంజూరైంది. సంబంధిత ఆర్డర్ కాపీతోనే వచ్చాను. మీరంతా సంతోషంగా ఉండాలి. పిల్లలు చక్కగా చదువుకోవాలి. మంచి ఉద్యోగాలు చేయాలి' అని హోంమంత్రి చెప్పారు. అధికారులకు ఆదేశాలు..2014 నుంచి 2019 వరకు ఈ గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ఇప్పుడు రేషన్ డిపో ఏర్పాటు చేస్తున్నామని అనిత అన్నారు. త్వరలో సెల్ టవర్ స్థాపన చేస్తామని తెలిపారు. గ్రామంలో 20 మంది పిల్లలు ఇంటర్, డిగ్రీ వరకు చదివారన్న ఆమె.. ఇద్దరు ఆడపిల్లలు డిగ్రీ చదువుతుండటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అంతేకాకండా.. అణుకు గ్రామంలో ఒక్కో ఇంటికి ఒక బాత్‌రూమ్ నిర్మాణం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారామె.

# సంక్రాంతి పండుగ రోజు చోరీ కేవలం ఒక్కరోజులోనే

**విశాఖపట్నం, జనవరి 16:** సంక్రాంతి పండుగ రోజున గాజువాకలో చోరీ జరిగింది. ఈ చోరీని 24 గంటల్లోనే గాజువాక క్రైమ్ పోలీసులు ఛేదించారు. సంక్రాంతి సందర్భంగా వైజాగ్ షాపింగ్ మాల్‌లో ఏ వస్తువైనా రూ.180కే అంటూ భారీ సేల్‌ను ఏర్పాటుచేశారు. ఈ క్రమంలో ఓ మహిళ షాపింగ్ మాల్ లోపలికి వెళ్లే సమయంలో తన బ్యాగ్‌ను సెక్యూరిటీ వద్ద ఉంచింది. అయితే. ఓ గుర్తు తెలియని వ్యక్తి తన బ్యాగ్‌తో పాటు సెక్యూరిటీ వద్ద ఉంచిన మరో బ్యాగ్‌అనూ దొంగలించాడు. ఆ బ్యాగ్‌లో రూ.50 వేల నగదుతో పాటు 11 తులాల బంగారం ఉన్నట్టు గుర్తించిన సదరు వ్యక్తి.. దాన్ని తనతో పాటు తీసుకెళ్లిపోయాడు. తన బ్యాగ్ కనిపించకపోవడంతో వెంటనే ఆ మహిళ గాజువాక క్రైమ్ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వైజాగ్ షాపింగ్ మాల్‌లో సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. ఆ ఫుటేజీ ఆధారంగా నిందితుడు ఉపయోగించిన వాహనాన్ని ట్రాక్ చేశారు. ఒక్కరోజు



వ్యవధిలోనే నిందితుడిని అరెస్ట్ చేశారు పోలీసులు. దొంగలించిన బ్యాగ్‌ను శ్మశానవాటికలో దాచినట్లు విచారణలో తెలిపాడు నిందితుడు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని ఆ బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. బ్యాగ్‌లో ఉన్న బంగా రు ఆభరణాలు, నగదు అలాగే ఉన్నట్లు గుర్తిం చారు. అనంతరం.. బాధితురాలికి తిరిగి బ్యాగ్ ను అప్పగించారు గాజువాక క్రైమ్ పోలీసులు. పండుగ పూట బంగారం, నగదును గుర్తుతె లియని వ్యక్తి దొంగలించడంతో బాధితురాలు తీవ్ర భయాందోళనకు గురైంది. చివరకు పోలీ సులు ఎంతో చాకచక్యంగా కేసును ఛేదించి.. బ్యాగ్‌ను తిరిగి అప్పగించడంతో బాధితురాలు హర్షం వ్యక్తం చేసింది. ఈ విధంగా సమర్థ వంతంగా కేసును ఛేదించిన గాజువాక క్రైమ్ పోలీసుల ప్రతిభకు విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత అభినందనలు తెలిపారు.

# ఏపీలో మరో రూ. ౨౦ వేల కోట్ల పెట్టుబడి

**అమరావతి :** చమురు ఉత్పత్తిలో గల్ఫ్ దేశమైన సౌదీ అరేబియా అగ్రగామిగా ఉన్న విషయం తెలిసిందే. అదే మాదిరిగా గ్రీన్ ఎనర్జీలో సౌదీ అరేబియాగా ఆంధ్రప్రదేశ్ అవతరిస్తుందని ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. ఈ మేరకు తాజాగా కీలక ప్రకటన చేశారు. హరిత ఇంధన రంగంలో కాకినాడలో త్వరలో 10 బిలియన్ల డాలర్లు (సుమారు రూ. 90.6 వేల కోట్లు) పెట్టుబడులు రాబోతున్నట్లు ప్రకటించారు. ఇక్కడ ఉత్పత్తి కాబోయే గ్రీన్ ఎనర్జీ.. జర్మనీ, సింగపూర్, జపాన్ వంటి దేశాలకు ఎగుమతి అవుతుందని వెల్లడించారు. దీనిపై శుక్రవారం (జనవరి ) సాయంత్రం 6 గంటలకు కీలక ప్రకటన చేస్తామని మంత్రి పేర్కొన్నారు. కాగా, కాకినాడలో ఇప్పటికే భారతదేశంలోనే మొట్టమొదటి, ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా కాంప్లెక్స్ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ పరిశ్రమను ఏఎమ్ గ్రీన్ సంస్థ నిర్మిస్తోంది. అందుతున్న సమాచారం ప్రకారం.. ఈ కాంప్లెక్స్‌లో శనివారం (జనవరి 17) ప్రధాన పరికరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా జరిగే కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా



చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ హాజరుకానున్నట్లు సమాచారం. కాగా, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ప్రపంచ హరిత ఇంధన వ్యాల్యూ చైన్‌లో ప్రాముఖ్యత దృష్ట్యా.. ఈ ప్రాజెక్ట్‌కు ప్రాధాన్యం ఏర్పడింది. అయితే దీనిపై మంత్రి లోకేశ్ ఏమైనా అప్డేట్ ఇస్తారా లేక.. ఇతర పెట్టుబడులను ప్రకటిస్తారా అనేది ఆసక్తిగా మారింది. భారత్‌లో అతిపెద్ద గ్రీన్ ఎనర్జీ పెట్టుబడులలో ఏఎమ్ గ్రీన్ ప్రాజెక్ట్ ఒకటి అని గతంలో ప్రభుత్వం ఓ ప్రకటనలో. అయితే ఈ ప్రాజెక్టు వల్ల నిర్మాణ దశలోనే సుమారు 8,000 ఉద్యోగాల వస్తాయని అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా కార్యకలాపాలు ప్రారంభించాక.. పునరుత్పాదక ఇంధనం, లాజిస్టిక్స్, స్టోరేజ్, పోర్ట్ సేవలు వంటి అనుబంధ పరిశ్రమల్లో.. పెద్ద ఎత్తున, హై స్కిల్ ఉద్యోగాలను సృష్టిస్తుందని తెలిపారు. ఏఎం గ్రీన్ కంపెనీ.. నెదర్లాండ్స్‌కు చెందిన ఏఎంజీ మెటల్ భాగస్వామ్యంతో మొదటి దశలో రూ. 10,050 కోట్ల పెట్టుబడితో గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ అల్యూమినియం తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేయనుంది. ఈ కాంప్లెక్స్ సంవత్సరానికి 1.5 మిలియన్ టన్నుల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. దీని మొదటి దశ మార్చి 2027 నాటికి ప్రారంభం అవుతుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రాజెక్ట్ చివరి దశ 2030 నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. కాగా, గ్రీన్ అమ్మోనియా అంటే పర్యావరణానికి హాని చేయని పద్ధతుల్లో తయారుచేసే అమ్మోనియా.

# ఏపీ, తెలంగాణ జల వివాదాలపై కమిటీ ఈ నెల 30వ తేదీన తొలి భేటీ

**అమరావతి :** ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారానికి ఏర్పాటైన కమిటీ తొలి సమావేశం తేదీ ఖరారైంది. ఈ నెల 30వ తేదీన ఢిల్లీలోని సేవా భవన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు ఈ భేటీ జరగనుంది. ఈ మేరకు ప్రాజెక్టు అప్రైజల్ ఆర్గనైజేషన్ (పీఏవో), సీడబ్ల్యూసీ సమావేశ నోటీసును జారీ చేసింది. పోలవరం నల్లమలసాగర్ ప్రాజెక్టు సహా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య జల నిర్వహణకు సంబంధించిన ప్రధాన సమస్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు , కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు నుంచి అవసరమైన సమాచారాన్ని సేకరించనున్నారు. అవసరమైతే నిపుణులు, సీనియర్ ఇంజినీర్లను కమిటీకి సహాయకులుగా నియమించడం, ఇతరత్రా అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు పూర్తి



సమాచారం, నివేదికలతో హాజరుకావాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారానికి 15 మంది అధికారులతో జనవరి 2వ తేదీన కేంద్రం ప్రత్యేక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. కేంద్ర జల్‌శక్తి శాఖ శుక్రవారం ఉత్తర్వు లు జారీ చేసింది. సీడబ్ల్యూసీ చైర్మన్ నేతృత్వంలోని కమిటీలో ఇరు రాష్ట్రాల నుంచి నలుగురు చొప్పున అధికారులు, కేంద్ర సంస్థల నుంచి నలుగురిని నియమించింది. మూడు నెలల్లోగా నివేదిక ఇవ్వాలని కమిటీకి కేంద్ర జల్‌శక్తి శాఖ సూచించింది. కేంద్ర జల సంఘం చైర్మన్ అతుల్ జైన్ నేతృత్వం వహించే ఈ కమిటీలో తెలంగాణ నుంచి ఇరిగేషన్ శాఖ ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ ఆదిత్యానాథ్‌దాస్‌తోపాటు, ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్‌బొజ్జా, ప్రత్యే క కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఈఎన్సీ అమ్జద్ హుస్సేన్, ఏపీ నుంచి ఆ రాష్ట్ర జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ప్రభుత్వ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ న ర్సింహమూర్తి, అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం సీఈలను మెంబర్లుగా నియమించింది.

# వైభవంగా ప్రభల ఉత్సవం లక్షలాదిగా తరలిరానున్న భక్తులు


**అంబేద్కర్ కోనసీమ జిల్లా, జనవరి 16:** జిల్లాలోని అంబాజీపేట మండలం జగ్గన్నతోటలో (శుక్రవారం) ప్రసిద్ధమైన ప్రభల ఉత్సవం అత్యంత వైభవంగా జరుగనుంది. ఈ ఉత్సవం కోనసీమ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. ఏపీ ప్రభుత్వం ఈ ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో ఈసారి మరింత ఘనంగా నిర్వహిస్తున్నారు. సుమారు 450 ఏళ్లు చరిత్ర కలిగిన ఈ సంప్రదాయ ఉత్సవంలో ఏకాదశ రుద్రుల ప్రభలు 11 గ్రామాల నుంచి



ఊరేగింపుగా జగ్గన్నతోటకు తరలిరానున్నాయి. ముఖ్యంగా గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం నుంచి కౌశిక నదిని దాటుకుంటూ గ్రామస్తులు ప్రభలను తీసుకురావడం ఈ ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణ అని చెప్పుకోవాలి. వ్యాఘ్రేశ్వరం, కె.పెదపూడి, ఇరుసుమండ, వక్కలంక వంటి గ్రామాల నుంచి కూడా ప్రభలు ఊరేగింపుగా రానున్నాయి. లక్షలాది మంది భక్తులు, పర్యాటకులు తరలిరానున్న నేపథ్యంలో ప్రభుత్వం, స్థానిక అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ప్రభల ఉత్సవానికి ఈ ఏడాది సుమారు 5 లక్షల మంది భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. జగ్గన్నతోటకు వచ్చే వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. వాహనాల దారి మళ్లింపు చేపట్టారు. భక్తులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు కల్పించారు. అలాగే ప్రభల ఉత్సవంలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా భారీ భద్రతను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ముందుస్తు జాగ్రత్త చర్యలో భాగంగా వైద్య సిబ్బందిని కూడా ఉంచారు. ప్రభుత్వం ఇచ్చిన రాష్ట్ర పండుగ హోదాతో జగ్గన్నపేట ప్రభల ఉత్సవం ఇకపై ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందే అవకాశం ఉందని స్థానిక ప్రజలు భావిస్తున్నారు.

# రాజధాని రైతులతో భేటీ ఎమ్మెల్యే సుజనా చౌదరి కీలక వ్యాఖ్యలు


**అమరావతి, జనవరి 15:** కూటమి ప్రభుత్వం ఖచ్చితంగా రాజధాని అమరావతి ప్రాంతంలోని రైతుల సమస్యలను పరిష్కరిస్తుందని వారికి స్పష్టం చేశామని బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి తెలిపారు. సమస్యలు పరిష్కరించుకునేందుకు ఒక సంఘంగా ఏర్పడి.. ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని రైతులకు సూచించినట్లు చెప్పారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో మానిటరింగ్ చేసుకోవాలని వారికి తెలిపానని పేర్కొన్నారు.



గురువారం రాజధాని ప్రాంతంలోని మందడం గ్రామంలో ఎమ్మెల్యే సుజనా చౌదరితో రైతులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి దృష్టికి రైతులు.. తమ సమస్యలను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారితో ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు వ్యక్తిగతంగా కాకుండా రైతులు తరఫున నలుగురు ప్రతినిధులను ఎంపిక చేసుకో వాలని వారికి వివరించానన్నారు. సమస్యలపై అర్జీల స్టేటస్, ట్రాకింగ్ కోసం అవసరమైతే తన తరఫున సాఫ్ట్‌వేర్ మెకానిజాన్ని అందజేస్తానని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చానని పేర్కొన్నారు.

ఇక స్థానిక ఎమ్మెల్యే, కేంద్ర మంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌తోపాటు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అందరూ సమర్థవంతమైన నాయకులేనని గుర్తు చేశారు. వారితో సమన్వయంతో ముందుకు సాగాలంటూ ఈ సందర్భంగా రైతులకు స్పష్టం చేశారు. అమరావతి రాజధాని చట్టం అవుతుందని.. దానికి సంబంధించిన సాంకేతిక అంశాలు ప్రాసెస్‌లో ఉన్నాయని చెప్పారు. దీనిని కేంద్రం కచ్చితంగా చట్టం చేస్తుందని ఎమ్మెల్యే సుజనా చౌదరి విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో.. తమ సమస్యలను ఎమ్మెల్యే సుజనా చౌదరి దృష్టికి రైతులు తీసుకెళ్లారు. కొందరు అధికారుల తీరు వల్ల తమ సమస్యలు జటిలమవుతున్నాయని ఆయన ఎదుట రైతులు తమ ఆవేదన వెళ్లగక్కారు. కొందరు రైతుల సమస్యలు పరిష్కరించక పోవడం వల్లే.. అందరికీ సమస్యలు వెళ్తుందంటూ సుజనా చౌదరి దృష్టికి రాజధాని ప్రాంతంలోని మహిళలు తీసుకు వెళ్లారు.

# కలియుగ ప్రత్యక్షదైవం తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ 18 గంటల్లో సర్వదర్శనం



**తిరుమల :** తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. ఆలయ మాఢవీధు లు భక్తుల గోవిందా నామ స్మరణతో మారుమ్రోగిపోతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కంపార్టుమెంట్లన్ని నిండిపోగా శిలాతోరణం వరకు క్యూ లైన్లో నిలబడ్డారు. టోకెన్లు లేని భక్తులకు 18 గంటల్లో సర్వదర్శనం కలుగు తుందని టీటీడీ అధికారులు వెల్లడించారు. నిన్న 64,064 మంది తలనీలాలు సమర్పించుకోగా 30,663 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ.3.80 కోట్లు ఆదాయం వచ్చిందని వెల్లడించారు.

# డివైడర్‌ను ఢీకొన్న కారు టీడీపీ నేత మృతి

**ప్రకాశం, జనవరి 16:** జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో టీడీపీ నేత మృతిచెందారు. మేదరమెట్ల వద్ద ఓ కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నెల్లూరు టీడీపీ నాయకుడు, 42ఒ43 క్లస్టర్ ఇంఛార్జ్ జాకీర్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని జాకీర్‌ను చికిత్స నిమిత్తం ఒంగోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ జాకీర్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే మంత్రి పొంగూరు




నారాయణ ఒంగోలు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును, వైద్యులు అందించిన చికిత్సను అడిగి తెలుసుకున్నారు మంత్రి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జాకీర్ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయినట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. జాకీర్ మృతి పట్ల మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టీడీపీ నేత భౌతికకాయాన్ని మంత్రి నారాయణ సందర్శించి నివాళు లర్పించారు. జాకీర్ మృతిపై టీడీపీ నేతలు, కార్యకర్తలు సంతాపం తెలియజేశారు. కాగా.. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు..

# జమ్మూ సరిహద్దులో డ్రోన్ల కలకలం భారత్ సైన్యం అలర్ట్



**న్యూ ఢిల్లీ:** ఓ వైపు భారత్‌తో స్నేహ సంబంధాలు కొనసాగిస్తాం అంటూనే.. మరోవైపు కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది పాకిస్థాన్. గురువారం రాత్రి జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంబడి రెండు పాక్ డ్రోన్లు సంచరించినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. డ్రోన్ల కదలికలు చూసిన వెంటనే భారత సైన్యం స్పందించి యాంటీ-డ్రోన్ ఆపరేషన్ చేపట్టడంతో అవి వెనుదిరిగాయి. ఈ వారంలోనే ఇలా జరగడం మూడోసారి అంటున్నారు. పాకిస్థాన్‌కు భారత్ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరికలు జారీ చేసిన కొద్ది గంటల్లోనే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. గణతంత్ర దినోత్సవం వేడుకల నేపథ్యంలో సరిహద్దుల్లో భద్రతా దళాలు పహారా కాస్తున్నాయి. డ్రోన్ల కదలికల తర్వాత ఆ ప్రాంతంలో హై అలర్ట్ ప్రకటించి, భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. మంగళవారం రాత్రి, రాజౌరి జిల్లాలోని నియంత్రణ రేఖ (గాజ) దాటి భారత భూభాగంలోకి అనుమానిత పాక్ డ్రోన్లను అడ్డగించడానికి ఆర్మీ సిబ్బంది కాల్పులు జరిపారు.

# నోట్ల కట్టల కేసులో పిటిషన్ సుప్రీంకోర్టులో జస్టిస్ యశ్వంత్ వర్మకు చుక్కెదురు

అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనపై ఉన్న అవినీతి ఆరోపణలపై పార్లమెంటరీ ప్యానెల్ చేపడుతున్న దర్యాప్తు చట్టబద్ధతను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం కొట్టివేసింది. అలాగే లోక్‌సభ స్పీకర్ ఆయనను తొలగించాలంటూ వచ్చిన అభిశంసన తీర్మానాన్ని స్వీకరించడం సరైనదేనని స్పష్టం చేసింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎస్‌సీ శర్మలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. జనవరి 8న వాదనలు ముగించిన ధర్మాసనం తీర్పును రిజర్వ్‌లో ఉంచగా, శుక్రవారం ఉదయం ప్రకటించింది. జస్టిస్ వర్మ వాదనలను తోసిపుచ్చుతూ, పార్లమెంటరీ ప్రక్రియలో లోక్‌సభ స్పీకర్ తీసుకున్న చర్యల్లో ఎలాంటి అక్రమం లేదని కోర్టు తేల్చి చెప్పింది. కేసు నేపథ్యం ఇలా! గత ఏడాది మార్చి 14వ తేదీన న్యూఢిల్లీలోని జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం జరిగింది. ఆ ఘటన తర్వాత అక్కడ భారీ మొత్తంలో కాలిపోయిన నోట్ల కట్టలు బయటపడటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ వ్యవహారం వెలుగులోకి రావడంతో ఆయనపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. దాంతో అప్పట్లో ఢిల్లీ హైకోర్టులో పనిచేస్తున్న జస్టిస్ వర్మను తిరిగి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు. జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలు నిజమేనా! ఈ ఘటనపై అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా అంతర్గత విచారణకు ఆదేశించారు. పంజాబ్- హరియాణా



హైకోర్టు చీఫ్ జస్టిస్ షీల్ నాగు, హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ జీఎస్ సందవాలియా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనూ శివరామన్‌లతో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ మే 4వ తేదీన తన నివేదికను సమర్పిస్తూ జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలు నిజమని, ఆయన ప్రవర్తన న్యాయవృత్తికి విరుద్ధమని తేల్చింది.
విచారణ కమిటీ ఏర్పాటుఅయితే ఆ నివేదిక తర్వాత కూడా జస్టిస్ వర్మ రాజీనామా చేయలేదు. దీంతో అప్పటి సీజేఐ నివేదికను, జస్టిస్ వర్మ ఇచ్చిన వివరణను రాష్ట్రపతి, ప్రధానమంత్రి వద్దకు పంపించారు. దాంతో ఆయనపై అభిశంసన ప్రక్రియకు బాట పడింది. అనంతరం ఆగస్టు 12వ తేదీన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, జస్టిస్ యశ్వంత్? వర్మను తొలగించాలంటూ వచ్చిన తీర్మానాన్ని స్వీకరించారు. అలాగే సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, మద్రాస్ హైకోర్టు చీఫ్ జస్టిస్ మణీంద్ర మోహన్ శ్రీవాస్తవ, సీనియర్ న్యాయవాది బీవీ ఆచార్యలతో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. సుప్రీంకోర్టుకు యశ్వంత్ వర్మఅయితే మొత్తం ప్రక్రియను సవాల్ చేస్తూ జస్టిస్ వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జడ్జెస్ (ఇంక్వైరీ) చట్టం--1968 ప్రకారం స్పీకర్‌కు ఆ విధంగా కమిటీ ఏర్పాటు చేసే అధికారం లేదని, రాజ్యసభలో ఇలాంటి తీర్మానం తిరస్కరణకు గురైన నేపథ్యంలో లోక్‌సభ చర్యలు చెల్లవని ఆయన వాదించారు. అలాగే రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌కు తీర్మానాన్ని తిరస్కరించే అధికారం లేదని పేర్కొన్నారు. విచారణ కమిటీ చట్టబద్ధంగానే ఉందన్న న్యాయస్థానంఅయితే సుప్రీంకోర్టు జస్టిస్ వర్మ వాదనలను అంగీకరించలేదు. అధ్యక్షుడు లేని సమయంలో ఉపాధ్యక్షుడు బాధ్యతలు నిర్వర్తించగలిగినట్టే, ఛైర్మన్ లేనప్పుడు డిప్యూటీ ఛైర్మన్ కూడా అధికారాలు వినియోగించవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది. అలాగే స్పీకర్ ఏర్పాటు చేసిన విచారణ కమిటీ ఉందని తేల్చింది. ఈ తీర్పుతో జస్టిస్ యశ్వంత్ వర్మపై పార్లమెంటరీ ప్యానెల్ దర్యాప్తు కొనసాగేందుకు మార్గం సుగమమైంది.

# ఒడిశా భీమ మండలి గుహలు- 15 వేల ఏళ్లనాటి ఆదిమానవుల ఆనవాళ్లు



**ఒడిశా :** సంబల్‌పూర్ జిల్లా రైరాఖోల్ అటవీ కొండల్లో ఉన్న భీమ మండలి గుహలు, భారత ప్రాచీన చరిత్రను కొత్త కోణంలో చూపించే ఆధారాలను వెలికి తీస్తున్నాయి. ఈ ప్రాంతంలో కొనసాగుతున్న తవ్వకాల్లో సుమారు 15 వేల సంవత్సరాల నాటి మానవ నివాసానికి సంబంధించిన ఆనవాళ్లు ఉండొచ్చని పురావస్తు అధికారులు భావిస్తున్నారు. గుహల గోడలపై శిలాచిత్రాలు, రాతి పనిముట్లుభీమ మండలి గుహల గోడలపై ఉన్న రాతి శిల్పాలు, ప్రాచీన చిత్రాలు, అలాగే తవ్వకాల్లో లభించిన రాతి పనిముట్లు భారత పురావస్తు సర్వే అధికారుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ ప్రాంతంలో లభించిన మట్టి పాత్రల అవశేషాలు, రాతి సూదులు ప్రస్తుతం కార్బన్ డేటింగ్ పరీక్షల కోసం పంపించారు. వీటి నిర్ధారణతో భీమ మండలి ప్రాధాన్యం మరింత స్పష్టమవుతుందని పరిశోధకులు భావిస్తున్నారు. భీమ మండలి కొండ గుహల్లో లభించిన ఆధారాలు రాతియుగ నాగరికతకు చెందినవిగా కనిపిస్తున్నాయని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. అందులో వేటకు ఉపయోగించిన పదునైన రాతి ఆయుధాలు, అలాగే గుహల గోడలపై ఉన్న చిత్రాలు, ఈ ప్రాంతంలో మానవ ఉనికిని తెలియజేస్తున్నాయని చెబుతున్నారు. మహాభారత కాలంతో ముడిపడ్డ నమ్మకాలురైరాఖోల్ ఉన్న ఈ గుహలు చాలాకాలంగా ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలవిగా, మహాభారత కాలానికి చెందినవిగా స్థానికులు విశ్వసిస్తున్నారు. దీంతో శాస్త్రీయంగా పరిశోధన చేయాలని డిమాండ్? పెరుగుతోంది. అంతకుముందు, గంగాధర్ మెహర్ యూనివర్సిటీ, ఇంటాక్ పరిశోధకులు ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. తాజాగా పూరి సర్కిల్‌కు చెందిన ఏఎస్ఐ ప్రత్యేక బృందం తవ్వకాలు ప్రారంభించింది. అందులో రాతి బ్లేడ్లు, కత్తులు, సూది ఆకారపు పనిముట్లు, ఈటెలు, బాణాలు లభించాయి. అయితే ఈ పరికరాలన్నీ ఇనుము, రాగి, కాంస్యం వంటి లోహాల వినియోగం తెలియని కాలానికి చెందినవిగా ఏఎస్ఐ అధికారి తెలిపారు. ఈ పనిముట్లు పూర్తిగా రాతియుగానికి చెందినవేనని ఆయన అన్నారు.

# గౌరీ లంకేశ్ హత్య కేసు నిందితుడి గెలుపు

**ముంబై:** మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా జాల్నా కార్పొరేషన్‌లోని 13వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన శ్రీకాంత్ పాంగార్కర్ విజయం సాధించారు. 2017లో ముంబైలో సంచలనం సృష్టించిన జర్నలిస్టు గౌరీ లంకేశ్ హత్య కేసులో శ్రీకాంత్ పాంగార్కర్ నిందితుడిగా ఉన్నారు. తాజా ఎన్నికల్లో ఆయన బీజేపీ, ఇతర పార్టీల నుంచి పోటీ చేసిన అభ్యర్థులపై 2,621 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఈ వార్డు నుంచి షిండే సారథ్యంలోని శివసేన తమ అభ్యర్థిని నిలబెట్టలేదు. పాంగార్కర్ 2001 నుంచి 2006 వవరకూ అవిభక్త శివసేన నుంచి కార్పొరేటర్‌గా సేవలందించారు. 2011లో టిక్కెట్ నిరాకరించడంతో ఆయన హిందూ జనజాగృతి సంస్థలో చేరారు. 2018లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి నాటు బాంబులు, ఆయుధాలను స్వాధీనం చేసుకున్న క్రమంలో మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ ఆయనను అరెస్టు చేసింది. పేలుడు పదార్థాల చట్టం,



చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఈ అరెస్టు జరిగింది. అయితే 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేనలో పాంగార్కర్ చేరారు. దీనిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఆయన అభ్యర్థిత్వాన్ని షిండే నిలిపివేశారు. జర్నలిస్టు, హక్కుల కార్యకర్త గౌరీ లంకేశ్‌ను 2017 సెప్టెంబర్ 5న ఆమె నివాసంలో దుండ గలు కాల్చిచంపారు. ఈ హత్య సంచలనం సృష్టించింది. భావప్ర కటనా స్వేచ్ఛను హరిస్తున్నారని, దేశంలో రాజకీయ అసహనం పెరిగిపోయిందంటూ దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఈ కేసులో నిందితుడిగా అరెస్టయిన పాంగార్క్‌కు 2024 సెప్టెంబర్ 4న కర్ణాటక హైకోర్టు బెయిలు మంజూరు చేసింది.

# అండర్‌వరల్డ్ మాజీ డాన్ కుమార్తెలు ఓటమి



**ముంబై:** మహారాష్ట్ర మున్సిపల్ పోల్స్‌లో ఆసక్తికర ఫలితాలు వెలువడుతున్నాయి. ముంబైలో ఒకప్పుడు పేరుగాంచిన గ్యాంగ్‌స్టర్, మాజీ ఎమ్మెల్యే అరుణ్ గావ్లీ కుమార్తెలైన గీత గావ్లీ, యోగిత గావ్లీ ఈ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. తమ తండ్రి గావ్లి స్థాపించిన అఖిల్ భారతీయ సేన తరపున ముంబైలోని బైకుల్లా ఏరియా నుంచి ఈ ఇద్దరూ పోటీ చేశారు. బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ నుంచి మూడుసార్లు కార్పొరేటర్‌గా గీత పనిచేశారు. ఈ ఎన్నికల్లో ఆమె 212వ వార్డు నుంచి పోటీ చేసి సమాజ్‌వాది పార్టీ అభ్యర్థి అమ్రిన్ షెహజాద్ అబ్రహాని చేతిలో ఓటమి పాలయ్యారు. 207వ వార్డు నుంచి యోగిత తొలిసారి పోటీ చేసి బీజేపీ అభ్యర్థి రోహిదాస్ లోఖాండే చేతిలో ఓటమి చవిచూశారు. ముంబైలో 2007 మార్చి 2న శివసేన కార్పొరేటర్ కమలాకర్ జామ్‌సండేకర్ తన నివాసంలో హత్యకు గురైన కేసులో అరుణ్ గావ్లీకి యావజ్జీవ కారాగార శిక్ష పడింది. ఈ కేసులో సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేయడంతో 2025 సెప్టెంబర్‌అబశ్రీశ్రీలో నాగపూర్ జైలు నుంచి ఆయన విడుదలయ్యారు. 1980, 1990 దశకంలో దావూద్ ఇబ్రహీం గ్యాంగ్ డి-కంపెనీకి సమాంతరంగా ఆయన క్రైమ్ సిండికేట్ నడిపారు. 70 ఏళ్ల గావ్లి 2004 నుంచి 2009 వరకూ ముంబైలోని చించ్‌పోకలీ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్నారు.

# ఇజ్రాయెల్‌లో ఉద్రిక్తతల వేళ భారతీయులకు హెచ్చరిక

**పశ్చిమాసియా :** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో భారత్ కీలక సూచనలు జారీ చేసింది. ఇజ్రాయెల్‌లో నివసిస్తున్న భారతీయులు అప్రమత్తంగా ఉండాలని టెల్ అవీవ్‌లోని భారత రాయబార కార్యాలయం మార్గదర్శకాలు విడుదల చేసింది. ప్రస్తుత భద్రతా పరిస్థితుల దృష్ట్యా అత్యవసరం కాని ప్రయాణాలను పూర్తిగా మానుకోవాలని సూచించింది. అలాగే ఇజ్రాయెల్ ప్రభుత్వం, హోమ్ ఫ్రంట్ కమాండ్ జారీ చేసిన భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని భారతీయులను కోరింది. అత్యవసర పరిస్థితుల్లో హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలిఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రకటన విడుదల చేసిన రాయబార కార్యాలయం, "ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఇజ్రాయెల్‌లో ఉన్న భారతీయులు అప్రమత్తంగా ఉండాలి. స్థానిక అధికారులు, హోమ్ ఫ్రంట్ కమాండ్ ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించాలి. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఇజ్రాయెల్‌కు అత్యవసరం కాని ప్రయాణాలు పెట్టుకోవద్దు" అని స్పష్టం చేసింది. అత్యవసర పరిస్థితుల్లో భారత రాయబార కార్యాలయం 24 గంటల హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని పేర్కొంది. ఇరాన్‌లో భద్రత క్షీణించింది: భారత్ మరోవైపు, ఇరాన్‌లో పరిస్థితులు రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతున్నాయి. అక్కడ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ఆందోళనలు హింసాత్మకంగా మారినట్లు సమాచారం. నిరసనకారులు- భద్రతా బలగాల మధ్య ఘర్షణలు




జరుగుతున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ అల్లర్లలో వేల మంది ప్రాణాలు కోల్పోయినట్లు అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌లో భద్రతా పరిస్థితి తీవ్రంగా క్షీణించిందని భారత్ భావిస్తోంది. ఇరా న్‌పై అమెరికా సైనిక చర్యలు చేపట్టే అవకా శముందన్న వార్తలు కూడా ఉద్రిక్తతను మరింత పెంచు తున్నాయి. ఇదే సమయంలో ఇజ్రాయెల్ భద్రతాపరమైన చర్యలు కఠినతరం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే ఇజ్రాయె ల్‌లోని భారతీయుల భద్రతపై భారత్ ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగానే టెల్ అవీవ్ రాయబార కార్యాలయం హెచ్చరికలు జారీ చేసింది. ఇరాన్‌కు ప్రయాణాలు మానుకోవాలిఇప్పటికే ఇరాన్‌కు ప్రయాణాలు మానుకోవాలని కేంద్ర విదేశాంగ శాఖ స్పష్టమైన సూచనలు ఇచ్చింది. తదుపరి నోటీసు ఇచ్చే వరకు ఇరాన్‌కు వెళ్లవద్దని భారత పౌరులను హెచ్చరించింది. అలాగే ఇరాన్‌లో ప్రస్తుతం ఉన్న భారతీయులు అందుబాటులో ఉన్న వాణిజ్య విమానాల ద్వారా వెంటనే ఆ దేశాన్ని వీడాలని సూచించింది. విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు, పర్యాటకులు అందరూ ఈ సూచనలను పాటించాలని కోరింది. పాస్‌పోర్టులు, గుర్తింపు కార్డులు ఎప్పుడూ దగ్గరే! ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా ప్రత్యేక ప్రకటన విడుదల చేసింది. నిరసనలు జరుగుతున్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని, స్థానిక వార్తలను గమనిస్తూ రాయబార కార్యాలయంతో ఎప్పటిక ప్పుడు సంప్రదింపులో ఉండాలని సూచించింది. ప్రయాణ పత్రాలు, పాస్‌పోర్టులు, గుర్తింపు కార్డులు ఎప్పుడూ దగ్గర ఉంచు కోవాలని తెలిపింది. ఇంకా రాయబార కార్యాలయంలో నమోదు చేసుకోని భారతీయులు వెంటనే నమోదు చేసుకోవాలని కోరింది.

# పాక్‌ను అడ్డుకోవాల్సిందే 'విభజన అజెండా' కోసం ఐరాసను దుర్వినియోగం చేస్తోంది: భారత్

**పాకిస్థాన్ :** విభజన అజెండా కోసం ఐక్యరాజ్యసమితి(ఐరాస) వేదికలను పాకిస్థాన్ దుర్వినియోగం చేస్తోందని భారత్ మండిపడింది. ఐరాస ఛార్టర్ ప్రకారం లభించిన స్వీయ నిర్ణయ హక్కును పాక్ దుర్వినియోగం చేయకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చింది. స్వీయ నిర్ణయ హక్కును వాడుకొని మతపరమైన వైవిధ్యం కలిగిన ప్రజాస్వామిక దేశాల్లో విభజనవాదాన్ని ప్రోత్సహించేలా మాట్లాడకుండా పాక్‌ను నిరోధించాలని కోరింది. ఐరాసలోని భారత శాశ్వత మిషన్ కౌన్సెలర్ ఎల్డోస్ మ్యాథ్యూ పున్నూస్ ఈ మేరకు పలు వ్యాఖ్యలు చేశారు. 2025లో ఐరాస కార్యక లాపాలపై సెక్రెటరీ జనరల్ విడుదల చేసిన వార్షిక నివేదికపై అమెరికాలోని న్యూయార్క్‌లో ఉన్న ఐరాస జనరల్ అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా మ్యాథ్యూ పున్నూస్ ప్రసంగిం చారు. కశ్మీర్ గురించి మాట్లాడే హక్కు పాక్‌కు లేదుప్రపంచ దేశాలన్నీ సంకుచిత ఆలోచనా దృక్పథం నుంచి బయటికొచ్చి మాట్లాడుతుంటే, పాక్ మాత్రమే విభజన అజెండాతో విషం కక్కుతోందని మ్యాథ్యూ పున్నూస్ మండిపడ్డారు. భారత్‌లో ఒక భాగమైన కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకశ్మీరు గురించి మాట్లాడేందుకు ఐరాసను పాక్ వేదికగా చేసుకోవడం సరికాదన్నారు. మరో దేశానికి చెందిన భూభాగం గురించి మాట్లాడే హక్కు ముమ్మాటికీ పాక్‌కు లేదన్నారు. 1948 ఏప్రిల్ 21న ఐరాస భద్రతా మండలి చేసిన తీర్మానం ప్రకారం జమ్మూకశ్మీరు నుంచి సేనలను పాక్ వెనక్కి తీసుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నాటి నుంచి జమ్మూకశ్మీరు ప్రజలు స్వేచ్ఛగా ఎన్నికలలో



ఓట్లు వేస్తూ, తమ ప్రతినిధులను చట్టసభలకు పంపుతున్నారని మ్యాథ్యూ పున్నూస్ తెలిపారు. ఈవిధంగా తాము భారతద్దేశ పక్షమే అనే సందేశాన్ని జమ్మూకశ్మీరు ప్రజలు ఇచ్చారని స్పష్టం చేశారు. పాక్ ప్రతినిధి ఆసిమ్ ఇఫ్తిఖార్ అహ్మద్ ఈ ఐరాస సెషన్‌లో జమ్మూకశ్మీరు అంశాన్ని లేవనెత్తడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. పాక్‌కు అలవాటుగా మారిపోయింది "విభజనవాద అజెండాను అన్ని వేదికల్లో ప్రమోట్ చేయడం పాకిస్థాన్‌కు అలవాటుగా మారిపోయింది. ఆ అలవాటునే ఇప్పుడు పాక్ కొనసాగిస్తోంది. మేం పాక్ వాదనకు కౌంటర్ ఇవ్వక తప్పదు. ఒకవేళ పాక్ నిరాధార ఆరోపణలు, అవాస్తవాలను మేం ఎప్పటికప్పుడు తిప్పి కొట్టకుంటే, అది వాస్తవ విరుద్ధ అంశాలను ఇలాగే చెబుతుంటుంది. మేం ఐరాసకు చెందిన అన్ని వేదికల్లో వాస్తవాలను తెలియజేస్తున్నాం. పాక్‌ను నిలువరించాల్సిన అవసరం ఉంది" అని మ్యాథ్యూ పున్నూస్ పేర్కొన్నారు. ప్రపంచ శాంతిపై ఐరాస గళం విప్పాలి"గ్లోబల్ సౌత్ దేశాల సెంటిమెంట్‌ను ఐరాస గౌరవించాలి. ఆ దిశగా నిర్దిష్ట చర్యలను చేపట్టాలి. దశాబ్దాల కిందటి సమీకరణాల ప్రకారం ప్రస్తుతం ఐరాసలో ప్రపంచ దేశాలకు ప్రాధాన్యతలు ఉన్నాయి. ఈ పరిస్థితి మారాలి. తాజా సమీకరణాల ప్రకారం ప్రపంచ దేశాలకు ప్రాధాన్యతలు దక్కాలి. ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ పక్ష సంస్థ ఐరాస ప్రస్తుత సందర్భానికి అనుగుణంగా మారాలి. ప్రస్తుతం చాలా సంక్లిష్టమైన దశను ఐరాస చవిచూస్తోంది. క్లిష్టమైన సవాళ్లను అది ఎదుర్కొంటోంది. శాంతి, భద్రత, వికాసం - మానవ హక్కులపై ఐరాస గళం విప్పాలని ప్రపంచ పౌరులు ఆశాభావంతో ఎదురు చూస్తున్నారు. అంతర్జాతీయ సమాజానికి సంబంధించిన కీలకమైన విధులను నిర్వర్తించలేని స్థితికి ఐరాస చేరడం అనేది దాని ప్రభావశీలత, ధర్మబద్ధత, విశ్వసనీయతలను ప్రశ్నార్థకంగా మార్చింది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో సంక్షోభాలు చోటుచేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో, ఆయా చోట్ల మనుషుల బాధలను తొలగించేలా ఐరాస మాట్లాడుతుందని ప్రపంచం ఆశిస్తోంది" అని మ్యాథ్యూ పున్నూస్ వ్యాఖ్యానించారు.

# మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ

**రాయ్‌పూర్:** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల లొంగుబాటు ప్రక్రియ కొనసాగుతోంది. 52 మంది మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. గురువారం ఉదయం బీజాపూర్ జిల్లా ఉన్నతాధికారులతోపాటు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ ఎదుట వీరంతా లొంగిపోయారు. వీరిలో 21 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో దండకారణ్యం స్పెషల్ జోన్, ఏవోబీలో విధులు నిర్వహిస్తున్న మావోయిస్టులతోపాటు బహ్మారాఘడ్ ఏరియా కమిటీలోని సభ్యులు సైతం ఉన్నారు. వీరిపై రూ.1.41 కోట్ల రివార్డు ఉందని పోలీస్ ఉన్నతాధికారులు ఈ సందర్భంగా తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పిస్తామని స్పష్టమైన భరోసా కల్పించడంతో వీరంతా లొంగిపోయారని బీజాపూర్ జిల్లా ఎస్పీ జీతేంద్ర కుమార్ యాదవ్ వెల్లడించారు. లొంగిపోయిన వారిలో.. డివిజన్ కమిటీ సభ్యుడు లక్కు కరం అలియాస్ అనిత్ (32), ప్లాటూన్ పార్టీ కమిటీ సభ్యులు లక్ష్మీ మాడ్వి (28), చిన్ని సోది అలియాస్ శాంతి (28).. వీరు ఒక్కొక్కరికి రూ. 8 లక్షల రివార్డు ప్రకటించామని చెప్పారు. మరో 13 మందికి.. ఒక్కొక్కరికి రూ. 5 లక్షలు, 19 మందికి రూ. 2 లక్షలు, మరో 14 మందికి రూ. లక్ష చొప్పున రివార్డుగా ప్రకటించామన్నారు. లొంగిపోయిన 52 మంది మావోయిస్టుల్లో 49 మందికి మొత్తం రూ. 1.41 కోట్లు ప్రకటించామని వివరించారు. అయితే ఈ లొంగిపోయిన మావోయిస్టులు అందరికి తొలుత రూ. 50 వేలు చొప్పున అందజేస్తామని జిల్లా ఎస్పీ యాదవ్ వెల్లడించారు.

# రాష్ట్రాల పురోగతి లక్ష్యంగా బడ్జెట్ కేటాయింపులు !

మరో పక్షం రోజుల్లో కేంద్ర బడ్జెట్ ప్రకటించనున్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతరామన్ మరోమారు బడ్జెట్ కసరత్తులో బిజీగా ఉన్నారు. ఇటీవల ఆయా రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో చర్చించారు. ఆయా రాష్ట్రాల మంత్రులు వారివారి రాష్ట్రాల్లో ఉన్న అవసరాలను, నిధుల కేటాయింపులపై వినతిపత్రాలు సమర్పించారు. తెలుగు రాష్ట్రాల నుంచి భట్టి విక్రమార్క, పయ్యావుల కేశవుఉల హాజరై తమ అసవరాలను, ఆకాంక్షలను వెల్లడంచారు. అయితే ఏటా కేటాయింపులు చేస్తున్నా..ఇప్పటి వరకు ప్రకటించిన కేటాయింపులు, ఖర్చులపై స్పష్టత లేదు. ఏ పథకానికి ఎంత ఖర్చు చేశారో తెలియదు. అలాగే అన్ని రాష్ట్రాలను సమానంగా చూస్తూ కేటాయింపులు ఉండాలి. బడ్జెట్ అంటే అభివృద్ధి దివఘా చర్యలు ఉండాలి. అనుకూల రాష్ట్రాలకు ఒక రకంగా, తమ పార్టీ పాలనలో లేని రాష్ట్రాలను మరో రకంగా చూసే విధానాలకు పాతరేయాలి. బడ్జెట్ అందరికి సమాన హక్కుగా ఉండాలి. అది దేశ ప్రగతిని ప్రతిఫలించాలి. తమకు మద్దు ఇస్తున్న పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ఒక రకంగా, మిగతా రాష్ట్రాలను మరో రకంగా చూసు విధానం సరికాదు. మరికొద్ది రోజుల్లో పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు జరగనుండగా, దానికి సన్నాహంగా ఇటీవల నిర్వహించిన ప్రీ బడ్జెట్ సమావేశంలో రాష్ట్రాల ఈ దైన్య స్థితి స్పష్టంగా వెలుగులోకి వచ్చింది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్రంలో ఎన్డిఎ కూటమికి చెందిన పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు సైతం నిధుల కోసం గళం విప్పాల్సి రావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. తమ తమ రాష్ట్రాల్లో నెలకొన్న దుర్భర పరిస్థితులను వివరిస్తూ అదనపు నిధులు కావాలని, జిఎస్టి పరిహారం కొనసాగించాలని సమావేశంలోనే ఆ రాష్ట్ర ప్రభుత్వాలూ విజ్ఞప్తులు చేశాయి. పన్నుల వసూళ్లలో రాష్ట్రాల వాటా తగ్గిస్తూ, గ్రాంట్లు ఆలస్యం చేస్తూ, అప్పుల పరిమితులను కట్టడి చేస్తూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరే రాష్ట్రాల ఈ దుస్థితికి కారణం. సిపిఎం నేతృత్వంలో ఎల్డిఎఫ్ ప్రభుత్వం అధికారంలో ఉన్న కేరళ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం మరింత కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. ఆర్థికంగా దిగ్బంధించడం ద్వారా వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వ ప్రతిష్టను ప్రజల్లో దిగజార్చే కుటిల వ్యూహానికి బిజెపి తెగబడుతోంది. ఇలా దాదాపు లక్ష కోట్ల రూపాయల మేర ఆ రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేంద్రం మంజూరు చేయడానికి నిరాకరిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. గత ఐదేళ్లలోనే 57వేల కోట్ల రూపాయలకు కోత పెట్టింది. పన్నుల వాటాను 3.89 శాతం నుండి 1.92 శాతానికి తగ్గించింది. ఈ చర్య వల్ల 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే కేరళ ప్రజలు 27 వేల కోట్ల రూపాయలు నష్టపోయారు. జిఎస్టి సంస్కరణల ద్వారా మనో 9వేల కోట్లను ఆ రాష్ట్రం కోల్పోయింది. త్వరలో ఎన్నికలు జరగనున్నఈ రాష్ట్రంలో ఈ తరహా రాజకీయ కక్ష సాధింపు చర్యలు పతాకస్థాయికి చేరడంతో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ సత్యాగ్రహం చేయాల్సి వచ్చింది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ ఆర్థిక దిగ్బంధనంపై కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ పెదవి విప్పక పోవడం పచ్చి అవకాశవాద రాజకీయం తప్ప మరోటి కాదు. ఏమైనప్పటికీ ఈ తరహా ఏకపక్ష విధానాలను నరేంద్రమోడీ ప్రభుత్వం ఇప్పటికైనా విడనాడాలి. రాజ్యాంగ బద్ధమైన రాష్ట్రాల హక్కులను గౌరవించాలి. లేని పక్షంలో ఈ తరహా ఆందోళనలు మరిన్ని రాష్ట్రాల్లో చోటుచేసుకునే అవకాశం ఉంది. బలమైన రాష్ట్రాలే కేంద్రాన్ని బలంగా నిలబెడతాయి. స్థిరమైన ఆర్థిక వనరులతోనే బలంగా నిలుస్తాయి. సమాఖ్య వ్యవస్థ పురోగతికి అత్యంత కీలకమైన ఈ అంశంపైనే నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం దాడి చేస్తోంది. ఆర్థిక హక్కులను క్రమేణా హరిస్తోంది. ఫలితంగా రాష్ట్రాలు ప్రతి చిన్న అవసరానికి కేంద్రం దయా దాక్షిణ్యాలపై ఆదారపడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.ప్రీ




బడ్జెట్ సమావేశంలో రాష్ట్రం తరపున పాల్గొన్న తెలంగాణ ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అనేక విషయాలను నిర్మలా సీతారామన్ ముందుంచారు. ఫ్యూచర్ సిటీ, నవోదయలు, మూసీ సుందరీకరణ, రోడ్ల విస్తరణ, ఎస్సీఆరెస్పీకి జాతీయ హోదా ,ట్రిపుల్ ఆర్ వంటి అనేక అంశాలను, నిధుల కేటాయింపులను ప్రస్తావించారు. వీటికి కేంద్రం బ్జడెట్‌లో ఏ రకమైన స్పందన చూపిస్తుందో చూడాలి. అలాగే ఎపికి చెందిన మంత్రి పయ్యావుల కేశవ్ కూడా కోరికల చిట్టా విప్పారు. రాష్ట్ర రాజధాని అమరావతి నగర నిర్మాణ పనులకు సాయాన్ని కొనసాగించాలని ఆయన కోరారు. విభజన హామిల్లో భాగమైన పోలవరం ప్రాజెక్టుకు పూర్తి నిధులు ఇవ్వాలని, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విశాఖపట్నం, రాయలసీమ ప్రాంతాల మౌలిక సదుపాయాల కోసం అదనపు కేటాయింపులు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ కోరికలు కోరడం ఇదే మొదటి సారికాదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతిసారీ దాదాపుగా ఇవే అంశాలను ప్రధాన మంత్రి నుండి మంత్రుల వరకు వ్యక్తిగతంగా కలిసి ఈ మేరకు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు. ఢిల్లీలో ఉన్న రాష్ట్ర ఎంపీలు, పర్యటనలకు వెళ్లే మంత్రులూ ఇదే పనిమీద ఉంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయినా, కేంద్రం నుండి నిధులు రావడం లేదు. మన రాష్ట్రమే కాదు, ఎన్డిఎలో మరో భాగస్వామిగాఉన్న బీహార్ ప్రభుత్వం నుండి కూడా ఇటువంటి విజ్ఞప్తులే అందాయి. పలు బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా జిఎస్టి నష్టపరిహారం, గ్రాంట్ల పెంపు, ప్రత్యేక ప్యాకేజీల కోసం కేంద్రాన్ని కోరినట్లు వార్తలు వచ్చాయి. నిధుల కేటాయింపుల్లో సమతుల్యత పాటించాలి. విభేదాలు పక్కన పెట్టాలి. అప్పుడే కేంద్ర, రాష్ట్రాల మధ్య సయోధ్య సాధ్యం అవుతుంది.

---

# చట్టవిరుద్ధంగా వాకీటాకీల విక్రయం

**• అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో సహా పలు సంస్థలకు షాక్ • ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై రూ.44లక్షల వరకు జరిమానా**

**న్యూఢిల్లీ,జనవరి16:** చట్టవిరుద్ధంగా వాకీ టాకీలను విక్రయిస్తున్న పలు ఈ-కామర్స్ సంస్థలపై కేంద్ర వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థ సుమోటోగా చర్యలు చేపట్టింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో సహా పలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై మొత్తంగా రూ.44లక్షల వరకు జరిమానా విధించింది. వినియోగదారుల రక్షణ, టెలికాం చట్టాలను ఉల్లంఘించి పలు ఈ-కామర్స్ సంస్థలు నిబంధనలకు అనుగుణంగా లేని ఉత్పత్తులను లిస్ట్ చేసి విక్రయిస్తున్నట్లు సీసీపీఏ గుర్తించింది. సాధారణంగా 446.0-446.2 బ్యాండ్‌లోని పర్సనల్ మొబైల్ రేడియోలకు మాత్రమే లైసెన్స్ మినహాయింపు వర్తిస్తుంది. మిగతా వాటి దిగుమతి, విక్రయాల కోసం తప్పనిసరిగా ఎక్విప్‌మెంట్ టైప్ అప్రూవల్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. అంతేగాక, లైసెన్సింగ్ నిబంధనలకు సంబంధించిన వివరాలను కూడా విక్రయదారులు స్పష్టంగా తెలియజేయాలి. అయితే, ఫ్లిప్‌కార్ట్ , అమెజాన్ , మీషో , జియో మార్ట్ తదితర ఈ-కామర్స్ సంస్థలు ఈ నిబంధనలను ఉల్లంఘించి నట్లు అఅఖం తెలిపింది. లైసెన్స్ మినహాయింపు ఫ్రీక్వెన్సీ రేంజ్ దాటి ఉన్న వాకీ టాకీలను ఈ కంపెనీలు విక్రయించినట్లు పేర్కొంది. ఇందుకు గానూ మీషో, మెటా, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ సంస్థలకు రూ.10లక్షల చొప్పున జరిమానా విధించింది. చిమియా, జియో మార్ట్, టాక్ ప్రో, మాస్క్‌మ్యాన్ టాయ్స్ సంస్థలకు రూ.లక్ష చొప్పున ÷న్ వేసింది. వీటిలో మీషో, మెటా, చిమియా, జియో మార్ట్, టాక్ ప్రో ఇప్పటికే పెనాల్టీలు చెల్లించినట్లు సీసీపీఏ వెల్లడించింది.




---

# నీరవ్ మోడీ కేసులో ఈడి దర్యాప్తు



**ఛోక్సీ తనయుడు రోహన్‌కు కూడా సంబధం**

**ఢిల్లీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు ఇడి వివరాలు**

**న్యూఢిల్లీ,జనవరి16:** పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.వేల కోట్లు ఎగవేసి పారిపోయిన వ్యాపారవేత్త, ఆర్థిక నేరగాడు మెహుల్ ఛోక్సీ కేసుపై ఈడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఎనిమిదేళ్లుగా కొనసాగుతోన్న దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు తాజాగా కీలక విషయం వెల్లడించారు. ఈ మనీలాండరింగ్ కేసులో మెహుల్ ఛోక్సీ కుమారుడు రోహన్ చోక్సీకి కూడా సంబంధం ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు దిల్లీలోని అప్పీలేట్ ట్రైబ్యునల్‌కు వివరాలు వెల్లడించారు. మెహుల్ చోక్సీ డైరెక్టర్‌గా ఉన్న లస్టర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీలో రోహన్ చోక్సీకి 99.99 శాతం వాటా ఉందని.. ఈ కంపెనీ నిధులను వారు విదేశాలకు మళ్లించడానికి ఉపయోగించుకు న్నారని దర్యాప్తులో తేలినట్లు ఈడీ అధికారులు పేర్కొన్నారు. నగదు అక్రమ చలామణిలో రోహన్ చోక్సీ చురుకుగా పాల్గొన్నట్లు తగిన ఆధారాలు ఉన్నాయన్నారు. దీంతో అతడి ఆస్తులను అటాచ్ చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రోహన్‌తో పాటు ఇతర కుటుంబసభ్యులను కూడా విచారించ డానికి ఈడీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి తీసుకున్న దాదాపు రూ.13 వేల కోట్ల రుణాలను ఎగ్గొట్టిన ఛోక్సీ, అతడి మేనల్లుడు నీరవ్ మోదీ దేశం విడిచి పారిపోయారు. ఛోక్సీ ఆంటిగ్వా-బార్బుడాకు వెళ్లగా.. నీరవ్ మోదీ లండన్‌లో ఆశ్రయం పొందాడు. ప్రస్తుతం నీరవ్ లండన్ లోని జైల్లో ఉన్నాడు. వారిని భారత్‌కు తీసుకురావడానికి విదేశాంగ అధికారులు ఆయా దేశాల అధికారులతో చర్చలు జరుపుతున్నారు.

---

# మృదుశక్తి మహిమను కోల్పోతున్నామా..?

ప్రపంచవ్యాప్తంగా మతాల మంచిచెడుల గురించి మాట్లాడటం ఇప్పుడు తగ్గిపోతోంది. నమ్మశక్యం కాకపోయినా ఇది నిజం! మత భావాలను రెచ్చగొట్టి, వాటికి అనుగుణంగా జనసమీకరణలు చేసే రాజకీయాలు చాలా దేశాల్లో పెరుగుతున్నాయి. అవి ఎంతగా పెరుగుతుంటే అంతగా మతాల మంచిచెడులపై సద్విమర్శలూ, సద్వివివేచనలూ తగ్గిపోతున్నాయి. మత ఆధారిత రాజకీయాల్లో ఏదో విధంగా ఎదుటి మతాలను దుమ్మెత్తిపోయటం, చిన్నబుచ్చటం, వాటిపై విద్వేషభావాలను పెంచటం, కొందరు చేసిన తప్పులకు ఆ మతాలను అనుసరించే వారందరూ బాధ్యులే అన్నట్లుగా వ్యవహరించటం సాధారణంగా కనపడుతుంది. అందుకే మతాల గొప్పలు, వారసత్వాల ఆసరాతో రాజకీయంగా బలాన్ని పెంచుకునేందుకు పావులను కదపటం వల్ల అన్నిచోట్లా బలి అవుతున్నదీ మూల్యాన్ని చెల్లిస్తున్నదీ సమిధలవుతున్నదీ సాధారణ పౌరులే.బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం కనపడే చిత్రం అదే. ప్రతిరోజూ హిందువులపై దాడులు, హత్యల వార్తలు వస్తూనే ఉన్నాయి. రాజ్యాన్ని ఇస్లామీకరిస్తామనీ, చట్టాలన్నిటినీ షరియా, హాదిత్‌లకు అనుగుణంగా మార్చేస్తామనీ చెప్పే జమాత్--ఇ--ఇస్లామీ లాంటి సంస్థలు బంగ్లాదేశ్‌లో అధికారం కోసం తహతహలాడుతున్నాయి. ప్రతి రాజకీయ సంక్షోభాన్ని.. కొన్నిమెట్లు పైకెక్కేలా ఉపయోగించుకోవటంలో మతతత్వ సంస్థలు ఎప్పుడూ ముందుంటూనే ఉన్నాయి. జనాగ్రహ వెల్లువలో షేక్‌హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత మతతత్వ సంస్థల, పార్టీల రాజకీయ చురుకుదనం బాగా పెరిగింది. అచ్చమైన, స్వచ్ఛమైన ఇస్లామిక్ పాలన తీసుకొస్తామనే నినాదాలు తప్ప జనజీవితాలను గణనీయంగా మార్చే ఆర్థిక విధానాలు మతతత్వ సంస్థలకు సహజంగానే ఉండవు. వాటికి కావాల్సిందల్లా ఒక మతం ప్రజలను నిత్యం శత్రువులా పరిగణించే రాజకీయాలు మాత్రమే. అక్కడి హిందువులందరినీ భారత అనుకూలురుగా, ఏజెంట్లుగా, ఇస్లాం వ్యతిరేకులుగా ఆరోపణలూ చేస్తూ దాడులకు పాల్పడుతూ మతప్రాతిపదికన ప్రజల్లో బలాన్ని పెంచుకోవటం వాటికి అవసరం. అందుకోసం చేసే మూకదాడులూ, దేవాలయాల విధ్వంసాలూ వారి దృష్టిలో నేరచర్యలు కావు. మతంతో సంబంధంలేని పౌరహక్కులకు వాటి దృష్టిలో ఎటువంటి విలువా లేదు. మతాతీతంగా అందరికీ వర్తించే పౌరహక్కుల భావనకు ఆ సంస్థలు వ్యతిరేకం. వచ్చేనెలలో ఆ దేశంలో ఎన్నికలు జరగనున్నాయి కాబట్టి మతతత్వ విద్వేషాలు మరింతగా రెచ్చగొడుతున్నారు. బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ), నిన్నమొన్నటి వరకూ అధికారాన్ని చలాయించిన అవామీలీగ్ పార్టీ సమయానుకూలంగా మతతత్వ పార్టీలు, సంస్థల అండదండలను అందిపుచ్చుకున్నవే. ఈ రెండు ప్రధానపార్టీలు మతతత్వంతో









అంటకాగకపోతే పరిస్థితి కాస్త భిన్నంగా ఉండేది. కానీ ఇప్పుడు దాన్ని వదులుకునే రీతిలో ఆ పార్టీల్లేవు. ప్రభుత్వానికీ, పాలనకూ ఇస్లాం విధానాలనే ఆలంబన చేసుకుంటామనీ రెండుపార్టీలూ ఎప్పుడో స్పష్టం చేశాయి.బంగ్లాదేశ్ ఏర్పడిన తొలినాళ్లలో రూపొందిన రాజ్యాంగంలో లౌకికవాదాన్ని పాలనకు మూలస్తంభంగా పేర్కొన్నారు. మతం ఆధారంగా నడిచే పార్టీలనూ నిషేధించారు. సోషలిజాన్ని రాజ్యాంగ మౌలిక సూత్రంగానూ పరిగణించారు. లౌకిక, సామ్యవాద పదాలను భారత రాజ్యాంగం నుంచి తొలగించాలని డిమాండు చేసే వారికి ఈ సంగతి తెలియకపోవచ్చు. తెలిసినా అప్రియసత్యాలను ప్రస్తావించటం ఇష్టమూ ఉండకపోవచ్చు. మనకంటే ముందుగానే (1972లో) వాటిని బంగ్లాదేశ్ రాజ్యాంగంలో పొందుపరిచారు. అధికారాన్ని పదిలం చేసుకోటానికి రాజకీయ కారణాలతో లౌకికవాదం నుంచి వైదొలగటమే బంగ్లాదేశ్‌లో ఇప్పుడు నెలకొన్న విద్వేష వాతావరణానికి ఒక ప్రధానకారణం. భారత్‌కు అనుకూలంగా వ్యవహరించినంత మాత్రాన అవామీలీగ్ లౌకికపార్టీ అయిపోదు. అవసరాన్ని బట్టి జమాత్--ఇ--ఇస్లామీతో జట్టుకట్టిన చరిత్ర ఆ పార్టీకి ఉంది. లౌకికవాదాన్ని రాజ్యాంగ మౌలిక సూత్రంగా 1977లో మిలటరీ పాలకులు తొలగించారు. అల్లా పట్ల సంపూర్ణ విశ్వాసం, భక్తి ఉందనే పదాలను రాజ్యాంగ పీఠికలో చేర్చారు. ఇక 1988లో ఇస్లాంని రాజ్యమతంగా అధికారికంగా ప్రకటించారు. షేక్ హసీనా 1996లో తొలిసారి అధికారంలోకి వచ్చినా వాటిని తీసివేయటానికి ప్రయత్నించలేదు. 2011లో భారీ మెజారిటీతో ప్రభుత్వ పగ్గాలను చేపట్టిన తర్వాత లౌకికవాద పదాన్ని మళ్లీ రాజ్యాంగంలో చేర్చినా రాజ్యమతంగా ఇస్లాం అనేదాన్నీ, పీఠికలో ప్రవేశపెట్టిన అల్లా పట్ల సంపూర్ణ విశ్వాసం--భక్తి లాంటి వ్యక్తీకరణలను అలాగే ఉంచేశారు. 2014 మార్చి 23న షేక్‌హసీనా చేసిన కీలక ప్రకటనతో బంగ్లాదేశ్ లౌకికవాదం వైపు మొగ్గే అవకాశం దాదాపుగా ముగిసిపోయింది.

TGTEL/25/A3750 ... నిజమే ... https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక

# బంగ్లాదేశ్‌లో 30 గంటల హైడ్రామాకు తెర
# నేటి నుంచే మళ్లీ బీపీఎల్ షురూ




బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు డైరెక్టర్ నజ్ముల్ ఇస్లాం చేసిన ఒక వివాదాస్పద వ్యాఖ్య దేశంలో పెను దుమారాన్ని రేపింది. టీ20 వరల్డ్ కప్ 2026 నేపథ్యంలో భారత్, ఐసీసీతో ఇప్పటికే ఘర్షణ పడుతున్న బంగ్లా బోర్డుకు, సొంత ఆటగాళ్లే షాక్ ఇచ్చారు. జనవరి 14వ తేదీన మొదలైన ఈ గొడవ, గురువారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. బోర్డు తమను అవమానిస్తోందని, ఆటగాళ్ల ప్రదర్శనను తక్కువ చేసి మాట్లాడుతోందని సీనియర్ ప్లేయర్లు లీగ్‌ను బహిష్కరించారు. పరిస్థితి చేయి దాటిపోతుండటంతో బోర్డు దిగివచ్చి సదరు అధికారిపై చర్యలు తీసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. జనవరి 14 మధ్యాహ్నం ఒక ప్రెస్ కాన్ఫరెన్స్‌లో బోర్డు డైరెక్టర్ నజ్ముల్ ఇస్లాం చేసిన వ్యాఖ్యలు అగ్గి రాజేసాయి. "వరల్డ్ కప్ ఆడకపోతే బోర్డుకు వచ్చే నష్టం ఏమీ లేదు, కేవలం ఆటగాళ్లకే మ్యాచ్ ఫీజులు రావు. ఇప్పటికే వారిపై కోట్లాది రూపాయలు ఖర్చు చేశాం.. కానీ వారు ఇస్తున్న ప్రదర్శన ఏమీ లేదు. బోర్డు ఏమైనా ఆ డబ్బును తిరిగి అడుగుతోందా?" అంటూ ఆయన వ్యంగ్యంగా మాట్లాడారు. ఈ మాటలు విన్న వెంటనే బంగ్లాదేశ్ క్రికెట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్లేయర్లు ఏకమయ్యారు. నజ్ముల్‌ను బోర్డు నుంచి తొలగించకపోతే ఏ టోర్నీలోనూ ఆడేది లేదని తేల్చి చెప్పారు.ఆటగాళ్ల హెచ్చరికను బోర్డు మొదట తేలికగా తీసుకుంది. కానీ జనవరి 15న జరగాల్సిన మొదటి బీపీఎల్ మ్యాచ్‌కు ఆటగాళ్లు రాకపోవడంతో బోర్డుకు అసలు విషయం అర్థమైంది. దీంతో ఒక్కసారిగా కలకలం రేగింది. నజ్ముల్ ఇస్లాంకు 48 గంటల షోకాజ్ నోటీసు ఇచ్చి చేతులు దులుపుకోవాలని బోర్డు చూసినా, ఆటగాళ్లు మాత్రం తగ్గలేదు. సీనియర్ ఆటగాళ్లంతా కలిసి ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి తమ డిమాండ్లను మరోసారి వినిపించారు. దీంతో చేసేదేమీ లేక రెండో మ్యాచ్‌ను కూడా రద్దు చేసి, లీగ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. ఇది అంతర్జాతీయ స్థాయిలో బంగ్లాదేశ్ క్రికెట్ పరువును తీసింది.వివాదం ముదురుతుండటంతో బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. నజ్ముల్ ఇస్లాంను ఫైనాన్స్ కమిటీ చైర్మన్ పదవి నుంచి తొలగించింది. ఈ నిర్ణయంతో ఆటగాళ్లు కొంత శాంతించారు. గురువారం రాత్రి 11:45 గంటల సమయంలో ప్లేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మొహమ్మద్ మిథున్, బోర్డు ప్రతినిధులు సంయుక్తంగా ప్రకటన చేశారు. దేశ క్రికెట్ ప్రయోజనాల దృష్ట్యా తాము సమ్మె విరమిస్తున్నామని, మళ్లీ మైదానంలోకి దిగుతామని ప్లేయర్లు ప్రకటించారు. నేటి నుంచి (జనవరి 16) బీపీఎల్ మ్యాచ్‌లు యథావిధిగా సాగనున్నాయి.

# దక్షిణాఫ్రికా టీ20 లీగ్‌లో సంచలనం
# మరో హ్యాట్రిక్ నమోదు




సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో సంచలనాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే లుంగి ఎంగిడి తొలి హ్యాట్రిక్ నమోదు చేయగా.. తాజాగా రెండో హ్యాట్రిక్ కూడా నమోదైంది. 2025-26 ఎడిషన్‌లో భాగంగా నిన్న (గురువారం) ప్రిటోరియా క్యాపిటల్స్, పార్ల్ రాయల్స్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ లో పార్ల్ రాయల్స్ బౌలర్ ఓట్నీల్ బార్ట్‌మన్() హ్యాట్రిక్ వికెట్లు తీశాడు. బార్ట్‌మన్ హ్యాట్రిక్ సహా ఐదు వికెట్లు తీసి రాయల్స్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఇదే ఎడిషన్‌లో కొన్ని రోజుల క్రితం ప్రిటోరియా క్యాపిటల్స్ జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్న స్టార్ బౌలర్ లుంగి ఎంగిడి తొలి హ్యాట్రిక్ నమోదు చేశాడు.ప్రిటోరియా క్యాపిటల్స్, పార్ల్ రాయల్స్ మ్యాచ్ విషయానికి వస్తే..తొలుత బ్యాటింగ్ చేసిన క్యాపిటల్స్.. బార్ట్‌మన్(5 వికెట్లు)ధాటికి 19.1 ఓవర్లలో 127 పరుగులకే కుప్పకూలింది. హర్డస్ విల్యోన్, సికందర్ రజా తలో రెండు వికెట్లు సాధించగా.. ఫోర్టుయిన్ ఒక వికెట్ తీశాడు. ప్రిటోరియా బ్యాటర్లు షాయ్ హోప్ (25), డెవాల్డ్ బ్రెవిస్ (21), షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ (29), ఆంద్రీ రసెల్ (15) మాత్రమే రెండంకెల స్కోర్లు చేయగలిగారు.జోర్డన్ కాక్స్, లిజాడ్ విలియమ్స్, లుంగి ఎంగిడి ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరారు. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని రాయల్స్(15.1 ఓవర్లలో ఛేదించింది. రూబిన్ హెర్మన్ (46) తృటిలో అర్ధ సెంచరీ చేజార్చుకున్నాడు. డాన్ లారెన్స్ (41), డేవిడ్ మిల్లర్(28లి) రాయల్స్ విజయంలో తమ వంతు పాత్ర పోషించారు. ప్రిటోరియా బౌలర్లలో లిజాడ్ విలియమ్స్ 2, ఎంగిడి, పీటర్స్ తలో వికెట్ తీశారు.

# మరో మైలురాయి తాకిన రోహిత్ శర్మ




టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇప్పటికే అనేక ఘనతలు సాధించిన హిట్ మ్యాన్ మరో అరుదైన మైలురాయిని(=శీప్ట్రఙ్ రాష్ట్రుతీఝ తీవఎశీతీం ాంఞు)దాటాడు. రాజ్‌కోట్ వేదికగా న్యూజిలాండ్‌తో నిన్న (జనవరి 14) జరిగిన రెండో వన్డేలో ఈ ఫీట్‌ను సాధించాడు. ఆసియా ఖండంలో 7000 (ప్రస్తుతం 7,019) వన్డే పరుగులు పూర్తి చేసుకున్నఏడో బ్యాటర్‌గా రికార్డుల్లోకెక్కాడు. 162 ఇన్నింగ్స్ లో ఈ మైలు రాయిని రోహిత్ అందుకున్నాడు. రోహిత్ కంటే ముందు క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, మిస్టర్ కూల్ ఎంఎస్ ధోని, విరాట్ కోహ్లీ, శ్రీలంక స్టార్ ప్లేయర్లు కుమార సంగక్కర, సనత్ జయసూర్య, మహేళ జయవర్ధనే వన్డేల్లో ఆసియాలో ఏడు వేల పరుగుల మైలురాయిని తాకారు.ఇక మ్యాచ్ విషయానికి వస్తే... తొలి వన్డేలో అద్భుత విజయం సాధించిన భారత జట్టుకు..రాజ్ కోట్‌వేదికగా జరిగిన రెండో మ్యాచ్‌లో చుక్కెదురైంది. న్యూజిలాండ్ చేతిలో 7 వికెట్ల తేడాతో ఓటమిని చూవిచూసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా.. నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (112 నాటౌట్) సూపర్ సెంచరీతో చెలరేగాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (56) అర్ధ సెంచరీతో రాణించాడు. కివీస్ బౌలర్లలో క్రిస్టియన్ క్లార్క్ 3, జెమీసన్, ఫోక్స్, లెనాక్స్, బ్రేస్‌వెల్ తలో వికెట్ తీశారు.అనంతరం ఓ మోస్తరు లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన న్యూజిలాండ్.. 47.3 ఓవర్లలో కేవలం 3 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయతీరాలకు చేరింది. డారిల్ మిచెల్ (131 నాటౌట్) అద్భుతమైన సెంచరీతో న్యూజిలాండ్ విజయంలో కీలపాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో భారత బౌలర్లు ఎంత శ్రమించినా మిచెల్, యంగ్‌ను ఔట్ చేయలేకపోయారు. హర్షిత్, ప్రసిద్ధ్ మాత్రమే తలో వికెట్ తీశారు. కాగా, ఈ సిరీస్‌లో నిర్ణయాత్మక మూడో వన్డే ఇండోర్ వేదికగా జనవరి 18న జరుగనుంది.

# ఓ మిడిల్ క్లాస్ వ్యక్తి 5 ఏళ్లలో
# కోటీశ్వరుడిగా మారొచ్చు




రాబోయే బడ్జెట్‌లో రైల్వేకు కేటాయింపులు భారీగా ఉంటాయని చర్చలు సాగుతున్నాయ్. బడ్జెట్‌లో రైల్వేలకు కేటాయింపులు గణనీయంగా పెరిగే అవకాశం ఉండడంతో, ఈ రంగంలోని స్టాక్స్‌పై పెట్టుబడిదారులు దృష్టి సారిస్తున్నారు. భవిష్యత్తులో రైల్వే రంగంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుని అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. వందేభారత్ రైళ్ళు, ట్రాక్‌ల ఆధునీకరణ, రైల్వే ప్లాట్‌ఫామ్‌ల అభివృద్ధి, ప్రైవేట్ రైళ్ల రాకతో ఈ రంగం వృద్ధికి తోడ్పడుతున్నాయి. 2026-27 నాటికి భారత రైల్వే రూపురేఖలు పూర్తిగా మారే అవకాశం ఉంది.ఈ నేపథ్యంలో దీర్ఘకాలిక పెట్టుబడికి అనుకూలమైన కొన్ని రైల్వే స్టాక్స్‌ను బిజినెస్ నిపుణులు సూచిస్తున్నారు. జూపిటర్ వాగన్స్, రైల్‌టెల్, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఆర్ఎఫ్‌సీ), రైల్ వికాస్ నిగమ్, టిటాగర్ రైల్, బిఈఎమ్ఎల్, టెక్స్మో రైల్, ట్రాన్స్‌జిల్ లైటింగ్, ఐఆర్‌సిటిసి లాంటి కంపెనీలు ఈ జాబితాలో ఉన్నాయి. ఈ కంపెనీలు రైల్వే రంగానికి అవసరమైన బోగీలు, ఫైనాన్సింగ్, మౌలిక సదుపాయాల కల్పన, సిగ్నలింగ్ వ్యవస్థలు, ఇంజిన్‌లు లాంటి వివిధ సేవలను అందిస్తు న్నాయి. బడ్జెట్ కేటాయింపులు, ప్రభుత్వ విధానాలు ఈ స్టాక్స్‌పై గణనీయ మైన ప్రభావాన్ని చూపిస్తాయి. దీర్ఘకాలిక లక్ష్యాలతో పెట్టుబడి పెట్టాలను కునేవారు ఈ కంపెనీల పనితీరును పరిశీలించాలని సూచిస్తున్నారు. కాగా, ఏదైనా స్టాక్స్ లేదా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టాలంటే.. ముందుగా నిపుణుడి సలహాలు తీసుకోవడం ముఖ్యమని అంటున్నారు.

# మీరు బంగారంలో పెట్టుబడి పెడుతున్నారా?
# ఈ పొరపాటు చేస్తే రాబడిలో 50 శాతం నష్టమే!




బంగారం ధర ఆకాశాన్ని అంటుతోంది. గత ఏడాదిలోనే బంగారం దాదాపు 80% మంచి రాబడిని అందించింది. అంటే గత ఏడాది ఎవరైనా రూ. లక్ష విలువైన బంగారాన్ని కొనుగోలు చేస్తే, దాని విలువ ఇప్పుడు దాదాపు రూ. 1.80 లక్షలకు పెరిగింది. ఈ సమయంలో బంగారం కంటే ఎక్కువ రాబడిని అందించే ప్రత్యామ్నాయం చాలా తక్కువ. ఈ బూమ్‌ను ఉపయోగించుకోవడానికి చాలా మంది బంగారంలో తమ పెట్టుబడులను పెంచుతున్నారు. కానీ మీరు తప్పుడు పద్ధతిలో బంగారు పెట్టుబడి ఎంపికను ఎంచుకుంటే పన్ను కారణంగా మీ మొత్తం రాబడిలో 30 నుండి 50% కోల్పోయే ప్రమాదం ఉందని మీకు తెలుసా?బంగారంలో పెట్టుబడి పెట్టడం అంటే ఇకపై నగలు, నాణేలు లేదా బార్లు కొనడానికి మాత్రమే పరిమితం కాదు. నేడు బంగారంలో పెట్టుబడి పెట్టడానికి ఇంకా చాలా ఎంపికలు ఉన్నాయి. బంగారు జుఖీలు, డిజిటల్ బంగారం, బంగారు బాండ్లు వంటి ఎంపికలు సాంప్రదాయ పెట్టుబడి పద్ధతులను, రాబడిని పూర్తిగా మార్చాయి. ఈ బంగారు ఎంపికలు సురక్షితంగా ఉంచడంలో ఇబ్బందిని తొలగిస్తాయి. లాభాలపై పన్ను భౌతిక బంగారం కంటే చాలా తక్కువగా ఉంటుంది. అందుకే ఈ బంగారు ఎంపికలు మరింత ప్రాచుర్యం పొందుతున్నాయి. మీరు బంగారంలో పెట్టుబడి పెట్టాలనుకు ంటే మీకు ఏ రకమైన బంగారం ఉత్తమమో అర్థం చేసుకుందాం.బంగారు బాండ్లు అత్యంత ప్రయోజనకర మైనవి:బంగారంలో పెట్టుబడి పెట్టడానికి అవి ఉత్తమ ఎంపికగా పరిగణిస్తారు. వాటికి కొన్ని షరతులు ఉన్నప్పటికీ, బంగారం నుండి మంచి రాబడిని సంపాదించడమే మీ లక్ష్యం అయితే, ఈ ఎంపికను కోల్పోకండి. సావరిన్ బంగారు బాండ్లు 2.5% వార్షిక వడ్డీ రేటును కూడా అందిస్తాయి. ఇది బంగారం ధర పెరుగుదల నుండి వచ్చే లాభం నుండి వేరుగా ఉంటుంది. విశేషమైన విషయం ఏమిటంటే మీరు మీ బంగారాన్ని లేదా మెచ్యూరిటీ తర్వాత దాని విలువను ఉపసంహరించుకున్నప్పుడు మీరు ఎటువంటి మూలధన లాభాల పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ బాండ్ 8 సంవత్సరాల మెచ్యూరిటీ వ్యవధిని కలిగి ఉంటుంది, ఆ తర్వాత మీరు మీ పూర్తి రాబడిని ఉపసంహరించుకోవచ్చు. అయితే మీ స్లాబ్‌ను బట్టి 2.5% వార్షిక వడ్డీపై మీకు పన్ను విధిస్తారు. మెచ్యూరిటీకి ముందు మీరు బాండ్‌ను రీడీమ్ చేసుకుంటే మీరు ఒక సంవత్సరం లోపు మీ స్లాబ్ ప్రకారం పన్ను చెల్లించాలి. ఆ తర్వాత 12.5 శాతం దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను విధిస్తారు.గోల్డ్ ఈటీఎఫ్‌లు, మ్యూచువల్ ఫండ్‌లుబంగారంలో పెట్టుబడి పెట్టడానికి రెండవ ఉత్తమ మార్గం గోల్డ్ ఈటీఎఫ్‌లు, గోల్డ్ మ్యూచువల్ ఫండ్‌ల ద్వారా. మీరు 12 నెలల పాటు ఉంచిన తర్వాత జుఖీని విక్రయిస్తే, మీరు 12.5% ??ప్రత్యక్ష దీర్ఘకాలిక మూలధన లాభాల పన్నుకు లోబడి ఉంటారు. మీరు 24 నెలల పాటు బంగారు మ్యూచువల్ ఫండ్‌ను కలిగి ఉంటే మీరు దీర్ఘకాలిక మూలధన లాభాల పన్నుకు లోబడి ఉంటారు. మీరు రెండు ఎంపికలను నిర్ణీత కాలానికి ముందు విక్రయిస్తే మీరు స్వల్పకాలిక మూలధన లాభాల పన్నుకు లోబడి ఉంటారు. ఇది మీ స్లాబ్‌ను బట్టి మారవచ్చు. దీని అర్థం మీరు 30% అధిక స్లాబ్‌లోకి వస్తే, మీరు రాబడిపై 30% పన్నుకు లోబడి ఉంటారు.మీరు బంగారు ఆభరణాలు, నాణేలు లేదా బార్లలో పెట్టుబడి పెట్టాలనుకుంటే అది రాబడి పరంగా సరైన ప్లాన్ కాదని గుర్తించుకోండి. మొదట మీరు భౌతిక బంగారాన్ని కొనుగోలు చేసేటప్పుడు 3% +ూ చెల్లించాలి. ఇంకా మీరు డిజిటల్ బంగారాన్ని కొనుగోలు చేస్తే, మీరు 3% +ూ కూడా చెల్లించాలి. మీరు దానిని 24 నెలలు ఉంచి ఆపై విక్రయిస్తే, మీరు లాభంపై 12.5% ??దీర్ఘకాలిక మూలధన లాభాల పన్నుకు లోబడి ఉంటారు. మీకు ఇండెక్సేషన్ ప్రయోజనం కూడా లభించదు. మీరు తక్కువ వ్యవధి తర్వాత దానిని విక్రయిస్తే మీరు మీ స్లాబ్ ఆధారంగా పన్ను చెల్లించాలి. ఇది 30% వరకు పెరగవచ్చు.


# ఒకరికి పంపబోయి ఎవరికో డబ్బు పంపారా




డిజిటల్ చెల్లింపుల యుగంలో , ఆన్‌లైన్ బ్యాంకింగ్ మన డైలీ లైఫ్‌ను చాలా ఈజీ చేశాయి. ఇప్పుడు డబ్బును ఎక్కడికైనా సెకన్లలో పంపవచ్చు. కానీ ఈ వేగంతో ఒక సమస్య కూడా పెరిగింది. కొంతమంది తొందర్లలో ఒకరికి పంపాల్సిన డబ్బుని వేరే ఎవరికో గుర్తు తెలియని నంబర్‌కు పంపుతున్నారు. ఆ తర్వాత చూసుకొని కంగారు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితిల్లో ఏం చేయాలి? మన డబ్బులు పోయినట్టేనా అంటే కాదు. మన డబ్బులు మనకు తిరిగి వస్తాయి. అందుకోసం ఇలా చేయాలి.ఉపయోగించి చెల్లింపు చేసి ఉంటే, ముం దుగా ఆ యాప్ కస్టమర్ సర్వీస్‌ను సంప్రదించండి. యాప్ సహాయం, మద్దతు లేదా సమస్యను నివేదించు ఎంపికలను అందిస్తుంది. తప్పు లావాదేవీని ఎంచుకుని ఫిర్యాదును దాఖలు చేయండి. ఫిర్యాదును దాఖలు చేసేటప్పుడు, మీరు లావాదేవీ నంబర్, తేదీ, మొత్తం వంటి వివరాలను అందించాలి. ఈ సమాచారం ఆధారంగా, యాప్ కస్టమర్ సర్వీస్ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ద్వారా వాపసు అభ్యర్థనను సమర్పిస్తుంది.యాప్‌తో మాట్లాడిన తర్వాత కూడా మీకు పరిష్కారం దొరకకపోతే, తదుపరి దశ మీ బ్యాంకును సంప్రదించడం. మీరు బ్యాంక్ కస్టమర్ కేర్ నంబర్‌కు కాల్ చేయవచ్చు లేదా మీ సమీప శాఖను సందర్శించి లిఖితపూర్వక ఫిర్యాదును దాఖలు చేయవచ్చు. బ్యాంక్ ద్వారా వివాదాన్ని నమోదు చేసి, రివర్సల్ ప్రక్రియను ప్రారంభించవచ్చు.చీూజ× హెల్ప్‌లైన్‌ప్రత్యామ్నాయంగా మీరు 1800-120-1740 నంబర్‌లో నేరుగా హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడం ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. వెబ్‌సైట్‌లో వివాద పరిష్కార యంత్రాంగం విభాగం ద్వారా ఆన్‌లైన్ ఫిర్యాదు ఎంపిక కూడా అందుబాటులో ఉంది. ఇక్కడ, మీరు లావాదేవీ నంబర్, పంపిన మొత్తం, రెండు ఖూ× ×ఐల వంటి వివరాలను అందించాలి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, తప్పు లావాదేవీ జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం వల్ల వాపసు పొందే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి. అందువల్ల మీరు లోపాన్ని గుర్తించిన వెంటనే ఆలస్యం చేయకుండా యాప్, బ్యాంక్ లేదా చీూజ×ని సంప్రదించడం ఉత్తమం. డిజిటల్ చెల్లింపుల విషయంలో అప్రమత్తత చాలా అవసరం, కానీ పొరపాటు జరిగినప్పటికీ, సరైన విధానాలను అనుసరించడం వల్ల నష్టాలను నివారించవచ్చు.

శనివారం, జనవరి 17, 2026
TGTEL/25/A3750 ... నిజమే ...
నిజాయితీ
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక
8

# 45 ఏళ్ల వయసులో నా డైట్ సీక్రెట్ ఇదే

సింగర్ స్మిత, మసక మసక ఆల్బమ్‌తో మళ్లీ పాప్ సంగీతంలోకి అడుగుపెట్టి అందరి దృష్టిని ఆకర్షించారు. మసక మసక పాట అనూహ్యంగా విజయవంతమైందని, విజువల్స్, మ్యూజిక్ ట్రీట్‌మెంట్ చాలా ప్రత్యేకంగా ఉన్నాయని స్మిత అన్నారు. మసక మసక పాట అనుకోకుండా పుట్టి, అద్భుతమైన విజయాన్ని సాధించిందని స్మిత తెలిపారు. ఈ పాట విజువల్ ట్రీట్‌మెంట్, మ్యూజిక్ ట్రీట్‌మెంట్ కొత్తదనాన్ని అందించాయని, అందుకే ప్రేక్షకులు బాగా ఆదరించారని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ పాట రీఎంట్రీకి బలమైన వేదికగా నిలిచిందని పేర్కొన్నారు. బిగ్ బాస్ షోలో స్మిత కనిపించడంపై ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించిందని, అక్కినేని నాగార్జున ఆమెపై చేసిన ప్రశంసలను ఆమె గుర్తుచేసుకున్నారు. నాగార్జున తన మ్యూజిక్ వీడియోను చూసి, “ఈ పాట పెద్ద హిట్ అవుతుంది. మీ వాయిస్ మునుపటి కన్నా మెరుగ్గా ఉంది” అని ప్రశంసించారని తెలిపారు.తన వెయిట్ లాస్, ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి అనేక ప్రశ్నలు ఎదురవుతున్నాయని స్మిత అన్నారు. తన శరీరం, జీవనశైలికి తగ్గట్టుగా ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ పద్ధతిని పాటిస్తున్నానని తెలిపారు. పొద్దున్నే తినకుండా, మధ్యాహ్నం మాత్రమే ఒక మీల్ తీసుకుంటానని, ఇది తన కడుపుకు విశ్రాంతినిస్తుందని చెప్పారు. మజిల్ పెంచడం, కొవ్వు తగ్గించడంపై దృష్టి సారించాలని, తనలాంటి శాకాహారులకు (వెజిటేరియన్లకు) ప్రోటీన్ తీసుకోవడం ఒక సవాలు అని తెలిపారు. కనీసం 50 కిలోల బరువు ఉంటే 50 గ్రాముల ప్రోటీన్ తీసుకోవాలని ఆమె సూచించారు, కానీ తాను అంత ప్రోటీన్‌ను తీసుకోవడం లేదని తెలిపారు. కార్బోహైడ్రేట్లు, రిఫైన్డ్ ఆయిల్స్‌ను తగ్గించడం వల్ల శరీరంలో ఇన్ఫ్లమేషన్ తగ్గుతుందని తాను గ్రహించినట్లు చెప్పారు. ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం కోసమే బరువు తగ్గడం ముఖ్యమని, ఇది కేవలం అందం కోసమే కాదని అన్నారు.పాప్ అనేది పాపులర్ సంగీతమని, దానిలో ఫోక్, రాక్, ర్యాప్ వంటి విభిన్న జానర్‌లను కూడా మిళితం చేయవచ్చని తెలిపారు. పాప్ సంగీత వీడియోలకు విజువల్స్, , ప్రతీ డీటెయిల్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వడం ముఖ్యమని స్మిత అన్నారు.

# చెప్పులు లేవు తినడానికి తిండిలేదు తల్లి గాజులతో14 ఏళ్లకే వ్యాపారం





డబ్బులు ఎవ్వరికీ ఊరికే రావు అనే డైలాగ్ గుర్తుకువస్తారు ఆయన.. తన బిజినెస్ కు తానే బ్రాండ్ అంబాసిడర్.. ఎన్నో రకాల యాడ్స్ తో ప్రేక్షకులను ఆకర్షిస్తున్నారు.. ఆయనే లలితా జ్యువెలర్స్ అధినేత డా. ఎం. కిరణ్ కుమార్. లలిత జ్యులరీ యాడ్స్ ద్వారా బాగా పాపులర్ అయ్యారు కిరణ్ కుమార్. ఈయన యాడ్స్ లో తోప్ అనే చెప్పాలి. కొత్త కొత్త ఐడియాలతో యాడ్స్ చేస్తూ ఆకట్టుకుంటున్నారు కిరణ్ కుమార్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో కిరణ్ కుమార్ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. చిన్నతనంలో తన కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొందని కిరణ్ కుమార్ పంచుకున్నారు. ఏమీ లేని స్థాయి నుంచి ఇప్పుడు లలితా జ్యువెలర్స్ అధినేతగా ఎదిగారు కిరణ్.ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి చెప్పులు వేసుకోలేదని.. ఆయన చనిపోయేంత వరకూ కూడా తన తండ్రి చెప్పులు వేసుకోలేదని తెలిపారు. ఇంట్లో భోజనానికి కూడా డబ్బులు లేని రోజులు చాలా ఉన్నాయని గుర్తుచేసుకున్నారు. 8 సంవత్సరాల వయసులోనే డబ్బు విలువ, ఆకలి కష్టాలను చూశాను అని ఆయన అన్నారు. తల్లిదండ్రులు తిండి గురించి మాట్లాడుకుంటున్నప్పుడు విన్న మాటలు ఆయనను ఎంతగానో ప్రభావితం చేశాయని తెలిపారు. అటువంటి పరిస్థితుల మధ్య 14 ఏళ్లకే వ్యాపారంలోకి అడుగుపెట్టా అని తెలిపారు కిరణ్ కుమార్.అలాగే ఆయన మాట్లాడుతూ.. తన వ్యాపారాన్ని 65 గ్రాముల బంగారంతో ప్రారంభించా అని తెలిపారు. తన తల్లి గాజులను కుదవ పెట్టకుండా, వాటిని కరిగించి ఆ బంగారంతోనే హోల్‌సేల్ వ్యాపారం మొదలుపెట్టా అని తెలిపారు. కేవలం 19 ఏళ్ల వయసుకే ఆయన కోటీశ్వరుడు అయ్యారు. తన చిన్న వయసులోనే ఈ స్థితికి చేరుకోవడానికి కారణం, తన బాల్యంలో ఎదుర్కొన్న కష్టాలే అని ఆయన స్పష్టం చేశారు. కిరణ్ కుమార్ డబ్బును, ఆకలిని తన గురువులుగా భావిస్తా అన్నారు. డబ్బు లేనప్పుడే దాని విలువ తెలుస్తుందని, ఆకలితో ఉన్నప్పుడే ఆహారం విలువ అర్థమవుతుందని ఆయన చెప్పారు. డబ్బు ఉన్నవాళ్లు దాన్ని తేలికగా తీసుకుంటారని, కానీ డబ్బును గౌరవించని వాళ్లు చాలా కష్టపడతారని అన్నారు. సమాజంలో కూడా డబ్బును చూసే మనుషులను గౌరవిస్తారని, ఇది నేటి వాస్తవ పరిస్థితి అని ఆయన అన్నారు. ప్రతిరోజు కేవలం 4-5 గంటలు మాత్రమే నిద్రపోతూ, మిగిలిన సమయం అంతా పనికే అంకితం చేస్తానని కిరణ్ కుమార్ తెలిపారు. తన గతాన్ని, కష్టాలను ఎప్పుడూ మర్చిపోకుండా, ప్రతిరోజూ దానిని గుర్తుంచుకుంటూనే ముందుకు సాగడమే తన విజయ రహస్యమని ఆయన అన్నారు.

# ఆ భయంతో సీరియల్స్ మానేసింది కట్ చేస్తే నెట్టింట అందాల రచ్చ



ఒకప్పుడు బుల్లితెరపై అమాయకమైన నటనతో.. అందంతో ప్రేక్షకులను కట్టిపడేసింది ఈ ముద్దుగుమ్మ. తక్కువ సమయంలోనే విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఒకటి రెండు సీరియల్స్ ద్వారా అలరించిన ఈ అమ్మడు.. ఇప్పుడు సోషల్ మీడియాలో మాత్రం అందాల రచ్చ చేస్తుంది. తాజాగా ఆమె షేర్ చేసిన గ్లామరస్ ఫోటోస్ ఆకట్టుకుంటున్నాయి.రెండు తెలుగు రాష్ట్రాల్లో సీరియల్స్ చూసేవారి సంఖ్య గురించి చెప్పక్కర్లేదు. హీరోహీరోయిన్లకు మించిన పాపులారిటీ.. ఇప్పుడు సీరియల్ తారలకు ఉంటుంది. సహజ నటన, ఆకట్టుకునే స్క్రీన్ ప్రెజెన్స్ తో చిన్న వయసులోనే స్టార్ స్టేటస్ సాధించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో సీరియల్స్ చూసేవారి సంఖ్య గురించి చెప్పక్కర్లేదు. హీరోహీరోయిన్లకు మించిన పాపులారిటీ.. ఇప్పుడు సీరియల్ తారలకు ఉంటుంది. సహజ నటన, ఆకట్టుకునే స్క్రీన్ ప్రెజెన్స్ తో చిన్న వయసులోనే స్టార్ స్టేటస్ సాధించింది.ఆ నటి మరెవరో కాదు... ప్రియాంక జైన్. మౌనరాగం సీరియల్ ద్వారా తెలుగు తెరకు పరిచయమైంది. ఆ తర్వాత జానకి కలగనలేదు సీరియల్ ద్వారా మరింత ఫేమస్ అయ్యింది. తక్కువ సమయంలోనే తన నటనతో ప్రేక్షకుల మనసు గెలుచుకుంది. ఆ నటి మరెవరో కాదు... ప్రియాంక జైన్. మౌనరాగం సీరియల్ ద్వారా తెలుగు తెరకు పరిచయమైంది. ఆ తర్వాత జానకి కలగనలేదు సీరియల్ ద్వారా మరింత ఫేమస్ అయ్యింది. తక్కువ సమయంలోనే తన నటనతో ప్రేక్షకుల మనసు గెలుచుకుంది.ఆ తర్వాత బిగ్ బాస్ తెలుగు 7లో పాల్గొని టాప్ 5గా నిలిచింది. ఈ షో నుంచి బయటకు వచ్చిన తర్వాత ప్రియాంక సీరియల్స్ మానేసింది. తన ప్రియుడు శివశంకర్ తో కలిసి సోషల్ మీడియాలో సందడి చేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోస్ వైరల్ గా మారాయి. ఆ తర్వాత బిగ్ బాస్ తెలుగు 7లో పాల్గొని టాప్ 5గా నిలిచింది. ఈ షో నుంచి బయటకు వచ్చిన తర్వాత ప్రియాంక సీరియల్స్ మానేసింది. తన ప్రియుడు శివశంకర్ తో కలిసి సోషల్ మీడియాలో సందడి చేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోస్ వైరల్ గా మారాయి.తన కెరీర్ ముందుగా మోడలింగ్ ద్వారా ప్రారంభమైందని.. ఆ సమయంలో తన హైట్ గురించి నెగిటివ్ కామెంట్స్ వచ్చాయని.. కొందరు మాత్రమే ప్రోత్సహించారని తెలిపింది. సీరియల్స్ వల్లే తనకు అసలై గుర్తింపు వచ్చిందని చెప్పుకొచ్చింది. తన కెరీర్ ముందుగా మోడలింగ్ ద్వారా ప్రారంభమైందని.. ఆ సమయంలో తన హైట్ గురించి నెగిటివ్ కామెంట్స్ వచ్చాయని.. కొందరు మాత్రమే ప్రోత్సహించారని తెలిపింది. సీరియల్స్ వల్లే తనకు అసలై గుర్తింపు వచ్చిందని చెప్పుకొచ్చింది.సీరియల్స్ మానేయడానికి గల కారణం చెప్పింది. సీరియల్స్ చేస్తే ఒకే రోల్ లో బందీ అయిపోతామనే భయం ఉందని.. సరైన డేట్స్, టైం దొరకదని.. సీరియల్ క్యారెక్టర్లకే పరిమితమైపోతామన్న భావనతోనే సీరియల్స్ చేయడం లేదని తెలిపింది సీరియల్స్ మానేయడానికి గల కారణం చెప్పింది. సీరియల్స్ చేస్తే ఒకే రోల్ లో బందీ భయం ఉందని.. సరైన డేట్స్, టైం దొరకదని.. సీరియల్ క్యారెక్టర్లకే పరిమితమైపోతామన్న భావనతోనే సీరియల్స్ చేయడం లేదని తెలిపింది

## 25 సినిమాలు చేస్తే 3 హిట్లు, 2 యావరేజ్



టాలీవుడ్ లో చాలా మంది కుర్ర హీరోలు సత్తా చాటుతున్నారు. కొత్త కొత్త సినిమాలతో, కథలతో ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. కంటెంట్ ఉన్న సినిమాలను ఎంచుకుంటూ మంచి విజయాలను అందుకుంటున్నారు. అయితే ఓ హీరో మాత్రం సక్సెస్ కోసం చాలా కాలం ఎదురుచూశాడు. వరుసగా సినిమాలు చేసినా అవి ప్రేక్షకులను మెప్పించలేకపోయాయి. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 25 సినిమాలు చేశాడు ఈ యంగ్ హీరో కానీ అందులో మూడు సినిమాలు మాత్రమే విజయం సాధించాయి. రెండు సినిమాలు యావరేజ్ గా నిలిచాయి. దాదాపు 13ఏళ్ల తర్వాత ఇటీవలే హిట్ అందుకున్నాడు. ఇంతకూ ఆ యంగ్ హీరో ఎవరో తెలుసా.?ప్రేమకావాలి సినిమాతో హీరోగా పరిచయం అయ్యాడు ఆది సాయి కుమార్. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకున్నడు. ప్రేమకావాలి సినిమా హిట్ తర్వాత వంటనే లవ్లీ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఈ సినిమా కూడా మంచి విజయాన్ని అందుకుంది. వరుసగా రెండు విజయాలను అందుకొని ఇండస్ట్రీలో హాట్ టాపిక్ అయ్యాడు ఆది సాయి కుమార్. కానీ ఆతర్వాత ఆది నటించిన సినిమాలు ప్రేక్షకులను నిరాశపరిచాయి. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసినప్పటికీ అవి బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టాయి.అయినా కూడా ఆది వెనకడుగు వేయకుండా సినిమాలు చేస్తూనే ఉన్నాడు. చూస్తూ చూస్తూనే 24 సినిమాలు పూర్తి చేశాడు. ఈ క్రమంలోనే ఇటీవలే తన 25వ సినిమా శంబాలా తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. శంబాలా సినిమా మంచి విజయాన్ని అందుకుంది. మైథలాజికల్ థ్రిల్లర్ గా తెరకెక్కిన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. దాంతో చాలాకాలం తర్వాత హిట్ రుచి చూశాడు ఆది సాయి కుమార్. ఈ చిత్రానికి యుగంధర్ ముని దర్శకత్వం వహించారు. అలాగే ఇందులో అర్చన అయ్యర్ కథానాయికగా నటించింది. త్వరలోనే ఈ సినిమా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఆహాలో ఈ సినిమా ఈనెల 22 నుంచి అందుబాటులోకి రానుంది.

## కొడుకు సినిమాల్లోకి ఎంట్రీ



టాలీవుడ్ నటుడు సునీల్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. హాస్యనటుడి నుండి హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించి మెప్పించారు. ప్రస్తుతం పాన్-ఇండియా స్టార్‌గా అనేక భాషా చిత్రాలతో బిజీగా ఉన్నారు. అయితే సునీల్ సినిమాల సంగతి పక్కన పెడితే.. తన పర్సనల్ లైఫ్ గురించి ఎప్పుడూ ఎక్కడ బయటపెట్టరు. అలాగే సునీల్ భార్య, పిల్లలు సైతం సోషల్ మీడియాకు దూరంగా ఉంటారు. గతంలో ఓ ఇంటర్వ్యూలో సునీల్ మాట్లాడుతూ తన కుటుంబం గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తన భార్య శృతి, పిల్లలు కావ్య కుందన, దుష్యంత్‌ల గురించి పంచుకున్నారు. తన సినీ కెరీర్‌లో హాస్యనటుడి నుండి హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా అనేక మలుపులు తిరిగిందని.. ఈ మార్పులను తాను వ్యక్తిగతంగా తీసుకోలేదని, కేవలం పాత్రలను మాత్రమే చూస్తానని చెప్పుకొచ్చారు. పుష్ప 2, సాయి ధరమ్ తేజ్ విరూపాక్ష వంటి తెలుగు చిత్రాలతో పాటు రజనీకాంత్ జైలర్, శివకార్తికేయన్ మహావీరుడు, విశాల్ మార్క్ ఆంటోనీ, కార్తి జపాన్ వంటి తమిళ చిత్రాలతో ఆయన క్రేజ్ మరింత పెరిగిపోయింది.సునీల్ తన కెరీర్‌లో తమిళ చిత్రాలలో కూడా నటిస్తున్నట్లు తెలిపారు. భాషాపరంగా ఉన్న అడ్డంకులను అధిగమించి, ఆయా పాత్రల కోసం మాండలికాలను నేర్చుకుంటున్నానని చెప్పారు. పుష్ప చిత్రంలో చిత్తూరు స్లాంగ్ నేర్చుకోవడం దీనికి నిదర్శనమన్నారు. మధురై తమిళం వచ్చి కఠినమైన మాండలికాలను కూడా నేర్చుకుంటూ, తమిళంలో హీరోగా అవకాశాలు వస్తున్నాయని, ఇది నటుడిగా ఎలాంటి సరిహద్దులు లేవని నిరూపిస్తుందని సునీల్ అన్నారు. నవ్వించడం అనేది సిక్స్ ప్యాక్ కంటే చాలా కష్టమైన పని అని, ఈ డిజిటల్ యుగంలో ప్రజలను నవ్వించడం మరింత సవాలుగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు.దర్శకుడు త్రివిక్రమ్‌తో తన స్నేహం గురించి మాట్లాడుతూ, త్రివిక్రమ్‌ను తాను గురూజీ అని పిలుస్తానని చెప్పారు. త్రివిక్రమ్‌కు ఎన్నో విషయాలపై లోతైన జ్ఞానం ఉందని, ఎవరికైనా సందేహాలుంటే వాటిని స్పష్టంగా వివరించగల గురు స్వభావం ఆయనలో ఉందని సునీల్ పేర్కొన్నారు. పంజాగుట్టలోని హిందీ నగర్‌లో చిన్న రూమ్ నుండి ఇద్దరి ప్రయాణం ప్రారంభమైందని, వారి స్నేహం దైవసంకల్పమని ఆయన అన్నారు.తన వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడుతూ, తన భార్య పేరు శృతి అని, తన కుమార్తె కావ్య కుందన 10వ తరగతి చదువుతుందని, కుమారుడు దుష్యంత్ 6వ తరగతి చదువుతున్నాడని సునీల్ వెల్లడించారు. తనది ఉమ్మడి కుటుంబమని, దేవుడి దయ వల్ల తాను సుస్థిరమైన జీవితాన్ని గడుపుతున్నానని, చాలా సంతోషంగా ఉన్నానని తెలిపారు. తన కెరీర్‌కు ఎటువంటి పరిమితులు లేవని, వచ్చిన అవకాశాలను ఆస్వాదిస్తానని అన్నారు.

# అందుకే వెంకటేశ్‌తో నటించలేదు




ఖుష్బూ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. ఒకప్పుడు దక్షిణాదిలో వరుస హిట్స్ అందుకుంది. అప్పట్లో ఆమెకు ఉండే క్రేజ్ గురించి చెప్పక్కర్లేదు. ఆమె అందానికి, నటనకు యూత్ ఫిదా అయ్యారు. ఏకంగా ఆమెకు గుడి కట్టారు. అప్పట్లో హీరోయిన్ గా అలరించిన ఖుష్బూ.. ఇప్పుడు సహాయ నటిగా రాణిస్తున్నారు. ఇదెలా ఉంటే.. గతంలో వెంకటేష్ నటించిన ఓ సూపర్ హిట్ సినిమాలో ముందుగా తనకే ఛాన్స్ వచ్చిందని కానీ తాను కొన్ని కారణాలతో ఆ సినిమాను వదులుకున్నట్లు తెలిపింది. కొన్ని రోజుల క్రితం ఓ ఇంటర్వ్యూలో తన లైఫ్, పర్సనల్ విషయాలతోపాటు కెరీర్ గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించింది.ఎక్కువ మంది చదివినవి : : వెయ్యి కోట్లు పోగొట్టుకున్నాను.. ఇప్పుడు నా దగ్గర ఉన్న ఆస్తి ఇంతే.. జగపతి బాబు కామెంట్స్..వెంకటేశ్ నటించిన కలియుగ పాండవులు సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది ఖుష్బూ. ఈ సినిమాకు తనను వెంకీ సిఫార్స్ చేశారని అన్నారు. హిందీలో ఓ సినిమాలో తనను చూసి ఎంపిక చేశారని.. ఆ తర్వాత నాగార్జున, బాలకృష్ణ, చిరంజీవితో నటించే అవకాశాలు వచ్చాయని.. అప్పటికే తను తమిళంలో బిజీ అయినట్లు తెలిపారు. అదే సమయంలో తెలుగు సినిమా పరిశ్రమ హైదరాబాద్ షిఫ్ట్ అయ్యిందని తెలిపింది.ఎక్కువ మంది చదివినవి :జీవితంలో అత్యంత బాధాకర రాత్రి.. 25 ఏళ్లుగా యూట్యూబ్?ను ఊపేస్తున్న సాంగ్.. 90'ం యూత్?కు ఇష్టమైన పాట.. ఇప్పటికీ ట్రెండింగ్..అలాగే వెంకటేశ్ నటించిన చంటి సినిమా కూడా తానే చేయాలని.. కానీ డేట్స్ కుదరలేదని తెలిపింది. చంటి సినిమా చేయాలంటే తమిళంలో రెండు సినిమాలు వదులుకోవాలని.. ఒక సినిమా రజనీకాంత్, మరో సినిమా కమల్ హాసన్ అని.. అందుకే ఆ సినిమా వదులుకోలేకపోయినట్లు తెలిపింది. అందుకే తాను చంటి సినిమా చేయలేదని అన్నారు.

Publisher, Owner And Editor Boddupally Mallaiah 3-62, Yendabetla, Nagarkurnool, Telangan - 509209,
Printer, Gundur Shyam , Shyam Agencies Telkapally(M), Telangana 509385. Published 2-48/1 Near Hanuman Temple, Telkapally(M) Dist.Nagarkurnool, Telangana 509385.
Ph 9441946907, Email : nijamenijayithi@gmail.com Website : nijamenijayithi.com